డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR










| తెలంగాణ Telangana | బుధవారం Wednesday | 03 - 06 -2026 03- 06 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 139 Issue: 139 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|




# తెలంగాణ రైజింగ్‌కు శ్రీకారం

- అమరవీరుల త్యాగాలకు వందనం.
- సంక్షేమంతో సమగ్రాభివృద్ధి.
- త్రివేల్యన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.





**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 2:**
స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ పోరాటాలు, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో పాల్గొన్న ఆయన, భద్రతా దళాల కవాతును పరిశీలించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాల వల్లే రాష్ట్రం సాధ్యమైందని, ఆ స్ఫూర్తితోనే ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. డిసెంబర్ 7, 2023న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తెలంగాణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

- మిగతా 2 లో...

# తెలంగాణలో జనసేన పోటీ ఖాయం

**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

- తెలంగాణపై ప్రేమే కారణం.
- విమర్శలకు ఘాటు సమాధానం.
- ఎన్నికల్లో జనసేన బరిలోకి.

2



# సంక్షేమంతో అభివృద్ధి లక్ష్యం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**

అమరవీరుల త్యాగాలకు నివాళి.
సంక్షేమంతో అభివృద్ధి లక్ష్యం.
ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా అడుగులు.

2





# తెలంగాణ ఆశయాలు నెరవేరాలి

**మంత్రి బండి సంజయ్ కుమార్.**
**బీజేపీ కార్యాలయంలో వేడుకలు.**
**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు.**
**బీజేపీకి అవకాశం ఇవ్వాలి.**



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించినప్పటికీ ఉద్యమ ఆశయాలు, లక్ష్యాలు మాత్రం పూర్తిస్థాయిలో నెరవేరలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం వేలాది మంది యువకులు, విద్యార్థులు పోరాడి ప్రాణత్యాగాలు చేశారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన జరగలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన, తెలంగాణ అమరవీరుల త్యాగాల ఫలితంగా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం

- మిగతా 2 లో...

# జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

భూపోరాటానికి కవిత పిలుపు.
జూలై 2న భారీ ఉద్యమం.
ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం.

02



# తెలుగు జాతి ఒక్కటే

**తెలంగాణకు చంద్రబాబు శుభాకాంక్షలు**



02

# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

- తెలంగాణ భవన్‌లో అవతరణ వేడుకలు.
- ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు.
- తెలంగాణ కోసం పోరాటం కొనసాగిస్తాం.



# సంక్షేమంతో అభివృద్ధి లక్ష్యం.

**జనం వాయిస్, ఖమ్మం, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అమరవీరుల త్యాగాల ఫలితంగా సాధించిన తెలంగాణను సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించే ప్రజల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమగ్రాభివృద్ధిని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత కార్యక్రమాలు, రైతు సంక్షేమ పథకాలు రాష్ట్రంలో సామాజిక భద్రతను బలోపేతం చేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పేద కుటుంబాలకు భద్రత, గౌరవప్రదమైన జీవనం కల్పించడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, హరిత ఇంధన రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, ప్రతి యువకుడికి అవకాశం, ప్రతి రైతుకు భరోసా, ప్రతి మహిళకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాల వరకు చేరేలా సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క అన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో తెలంగాణను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయమైన రోజని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, అమరవీరుల త్యాగ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తూ అభివృద్ధి పథంలో తెలంగాణను ముందుకు నడిపిస్తామని స్పష్టం చేశారు.

# జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, తెలంగాణ ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించే మహత్తర ఉద్యమమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యమ ఆశయాల సాధన ఇంకా పూర్తి కాలేదని అన్నారు. వేలాది మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు తమ భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ కోసం పోరాడారని, వారి త్యాగాలను తరతరాలకు గుర్తు చేసే బాధ్యత సమాజంపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం జరిగిన ఉద్యమాన్ని ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాలని, జూన్ 2ను కేవలం సెలవు రోజుగా కాకుండా ఆత్మగౌరవ దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించిన కవిత, ఆయన విగ్రహం ఇప్పటికీ రాష్ట్ర రాజధానిలో లేకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ఆలోచనకు రూపకల్పన చేసిన మహనీయుడైన జయశంకర్‌కు తగిన గౌరవం ఇవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు. ఆగస్టు 6న ఆయన జయంతి నాటికి ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే విగ్రహ నిర్మాణ వ్యయంతో పాటు నిర్వహణ బాధ్యతను కూడా తెలంగాణ జాగృతి భరిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరమని కవిత విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి గౌరవం, గుర్తింపు, సంక్షేమం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ అంశాలపై ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ఆశించామని, కానీ అలాంటి ప్రకటన రాకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఉద్యమకారుల సమస్యలు, భూముల అంశాలపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో భారీ భూపోరాటం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇది ఏ ఒక్క పార్టీ కార్యక్రమం కాదని, తెలంగాణ భవిష్యత్తు కోసం జరిగే ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, న్యాయవాదులు, ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మిలియన్ మార్చ్‌ను గుర్తు చేసే స్థాయిలో ఈ భూపోరాటం జరుగుతుందని కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కనిపించిన ప్రజా చైతన్యాన్ని మరోసారి ప్రదర్శించే సమయం వచ్చిందన్నారు. అమరవీరుల కుటుంబాలకు గౌరవం, ఉద్యమకారులకు గుర్తింపు, తెలంగాణ ఆశయాల సాధన కోసం ఈ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన తర్వాత అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని, ఉద్యమకారులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని కవిత హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేస్తూ, తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ ఆశయాలు నెరవేరాలి

- మొదటిపేజీ తరువాయి...
ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరకుండా పోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైనా బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి వస్తున్న నిధులను కూడా సమర్థంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' లక్ష్యంతో తెలంగాణకు భారీగా నిధులు కేటాయిస్తోందని చెప్పారు. మౌలిక సదుపాయాలు, జాతీయ రహదారులు, రైల్వేలు, విద్య, వైద్యం తదితర రంగాల్లో కేంద్రం తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తోందని వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు కొత్త ప్రత్యామ్నాయాన్ని ఆలోచించాల్సిన సమయం వచ్చిందని బండి సంజయ్ అన్నారు. మోసం చేసిన హస్తం, ద్రోహం చేసిన కారుకు ప్రజలు ఇప్పటికే సమాధానం చెప్పారని పేర్కొన్నారు. కేంద్ర నిధులను సమర్థంగా వినియోగిస్తూ నిజాయితీతో పని చేసే బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని తెలంగాణ సమాజాన్ని కోరారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం కోసం బీజేపీ కట్టుబడి పనిచేస్తుందని బండి సంజయ్ స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.

# తెలుగు జాతి ఒక్కటే

**జనం వాయిస్, అమరావతి, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందించిన ఆయన, రెండు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినా తెలుగు జాతి ఎప్పటికీ ఒక్కటేనని పేర్కొన్నారు. తెలుగు ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, భాషా, కుటుంబ బంధాలు ఎంతో గొప్పవని చంద్రబాబు అన్నారు. రాష్ట్రాల విభజన పరిపాలనా పరమైన అంశమే తప్ప ప్రజల మధ్య ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ విడదీయలేదని వ్యాఖ్యానించారు. ఉభయ రాష్ట్రాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అభివృద్ధి రంగంలో ఆరోగ్యకరమైన పోటీతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. పెట్టుబడులు, పరిశ్రమలు, విద్య, సాంకేతికత, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రెండు రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. రాబోయే రోజుల్లో తెలుగు ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచ స్థాయి నగరాలుగా ఎదగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ఈ రెండు నగరాలు అంతర్జాతీయ గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ప్రతిష్ఠను మరింత పెంచే కేంద్రాలుగా అవి రూపుదిద్దుకోవాలని అన్నారు. ప్రతి తెలుగు కుటుంబం అభివృద్ధి ఫలాలను అందుకోవాలని, ఉన్నత జీవన ప్రమాణాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పరంగా ప్రతి కుటుంబం ముందుకు సాగేందుకు ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు ముందుండాలని, ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతి ఖ్యాతిని మరింతగా చాటాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మరోసారి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభివృద్ధి, శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ రైజింగ్‌కు శ్రీకారం

- మిగతా 2 లో...
తెలంగాణ ఏర్పాటుకు వారు చేసిన కృషిని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ రైతులకు అండగా నిలిచేందుకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేశామని చెప్పారు. గత రెండున్నరేళ్లలో వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం లక్షా యాభై ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న, ఇతర పంటలకు కనీస మద్దతు ధర అందిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం నేరుగా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందన్నారు.

తెలంగాణ నీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి ఉత్తర తెలంగాణకు సాగునీరు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీటి వనరుల వినియోగంలో రాజీ పడకుండా తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతామని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల వారు దాదాపు పది వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని తెలిపారు. ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ లక్షలాది మంది మహిళలను స్వయం



ఉపాధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు.

యువతకు ఉద్యోగాల కల్పనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పారదర్శక విధానాలతో అరవై ఏడు వేల ఏడు వందల అరవై మూడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు చేపట్టి రికార్డు స్థాయిలో నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా నోటిఫికేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని విశ్వసిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విస్తృత చర్యలు చేపట్టామని, వేలాది పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులకు అల్పాహార పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాలతో విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. మొదటి ఏడాదిలోనే నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని, లక్ష ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తైందని వెల్లడించారు. సెప్టెంబర్ 17 నాటికి మరో రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. పేదలకు సొంత ఇల్లు అంటే ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఆహార భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూడు కోట్లకు పైగా ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకువచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం కోటి రూపాయల బీమా పథకం, నగదు రహిత వైద్య సేవల కోసం ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెట్రో విస్తరణ, పర్యావరణ పరిరక్షణ, మూసీ ప్రక్షాళన వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఆక్రమణలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటూ ప్రజల ఆస్తులను కాపాడుతున్నామని చెప్పారు.

భారత్ ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, మెట్రో విస్తరణ, బుల్లెట్ రైలు అనుసంధానం వంటి మహత్తర ప్రణాళికలతో తెలంగాణను ప్రపంచానికి గేట్‌వేగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్2047 దార్శనిక పత్రం ద్వారా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో ప్రజల సహకారం, ఆశీర్వాదం అవసరమని కోరుతూ జైహింద్, జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణలో జనసేన పోటీ ఖాయం

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 2:**
తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామానికి తెరలేపుతూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ప్రకటన చేశారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న విమర్శలు, బెదిరింపులు, తెలంగాణపై చేస్తున్న దుష్ప్రచారానికి ఘాటుగా బదులిచ్చారు. తెలంగాణ తనకు ఎంతో ఆత్మీయమైన నేల అని, ఈ ప్రాంతంపై తనకు ఎనలేని ప్రేమ ఉందని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు, విశ్లేషకులు ఉద్దేశపూర్వకంగా తనపై ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించలేదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగిన తీరును మాత్రమే ప్రశ్నించానని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పార్లమెంట్‌లో వ్యవహరించిన విధానాన్ని తప్పుపట్టానని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పుడూ గౌరవించానని, సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ తన కల అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన యువత, అమరవీరుల త్యాగాలకు తనకు అపార గౌరవం ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొందరు తనను తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో తాను చెరువు భూమిని ఆక్రమించానంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆ భూమిని పరిశీలించాలని సవాల్ విసిరారు. తాను భూమి ఆక్రమించినట్లు నిరూపితమైతే ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవచ్చని, తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని ప్రకటించారు. అధికార పదవుల కోసం రాజకీయాలు చేయడం తన లక్ష్యం కాదని, వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి అవ్వాలనే ఆశ తనకు లేదని, ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయాల ఉద్దేశమని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కార్యకర్తలు, నాయకులు ఎప్పటి నుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. అందుకే ఇకపై రాష్ట్రవ్యాప్తంగా స్వయంగా పర్యటించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జనసేన తప్పకుండా పోటీ చేస్తుందని, ఎవరి బెదిరింపులకు భయపడబోదని హెచ్చరించారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై మాట్లాడతామని, అన్యాయాలను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని, ఎవరూ తమ ఇష్టానుసారం ఎవరికైనా ప్రవేశం నిరాకరించలేరని పేర్కొన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా పవన్ భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు. గద్దర్ జీవించి ఉన్న సమయంలో ఆయనకు అవసరమైన సహాయం చేశానని, ఆయన తనను ఎంతో ఆప్యాయంగా చూసేవారని చెప్పారు. గద్దర్ బతికున్నప్పుడు పట్టించుకోని వారు ఇప్పుడు ఆయన పేరును రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం విచారకరమన్నారు. తనకు వామపక్షాలు, కుడిపక్షాలు అనే భావజాలాల కంటే మానవతా విలువలే ముఖ్యమని తెలిపారు. గద్దర్ చివరి రోజుల్లో కూడా యువత భవిష్యత్తుపై ఆలోచించారని, ఆ సందేశాన్ని సమాజానికి చేరవేయడం మన బాధ్యత అని అన్నారు. ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య కొందరు కావాలనే విద్వేషాలు




రెచ్చగొడుతున్నారని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుల తప్పులను ప్రజలపై మోపడం సరికాదని, ప్రాంతీయ ద్వేషాలు దేశ సమగ్రతకు హానికరమని హెచ్చరించారు. తెలంగాణలో పరిశ్రమలు రాకపోయినా, ఉపాధి సమస్యలు ఉన్నా వాటికి ఆంధ్ర ప్రజలను బాధ్యులను చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజలు వేరు, పాలకులు వేరు అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు పరస్పర గౌరవంతో జీవించాలని, భారతీయులుగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణపై తన ప్రేమను ఎవరూ ప్రశ్నించలేరని, రాష్ట్ర ప్రజలతో కలిసి పనిచేయడం కొనసాగిస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేస్తూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, తప్పుడు హామీలు, విష ప్రచారాలతో అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశ నుంచి వెనక్కి నెట్టిందని అన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులకు సరైన మద్దతు లేకపోవడం, పంటల కొనుగోళ్లలో జాప్యం, ఎరువుల సమస్యలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయని ఆరోపించారు. రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ వెనుకబడుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పెట్టుబడిదారులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఉండేదని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని, వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా తెలంగాణ భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మలేషియాలో ఘనంగా తెలంగాణ వేడుకలు

**జనం వాయిస్, కౌలాలంపూర్, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని ఎంఈసీసీ కన్వెన్షన్ సెంటర్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, మలేషియా తెలంగాణ అసోసియేషన్ సభ్యులు, ప్రవాస తెలంగాణవారు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిశోర్ కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై నాయకుడు సురకంటి శ్రీనివాస్, మలేషియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. తిరుపతి, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, బీఆర్ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతి, రాష్ట్ర నాయకులు ఉపేందర్ గౌడ్, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. కోట్లాది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని విదేశీ గడ్డపై జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణవారిపై ఉందని ఆయన అన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ప్రవాస తెలంగాణవారు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ జెండాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు ఘన నివాళులు



అర్పించారు. ఈ కార్యక్రమంలో మలేషియా తెలంగాణ అసోసియేషన్ సభ్యులు మన్సూర్, సంతోష్, సందీప్, జ్యోతి, మౌనిక, సుప్రియ, శశి శివతో పాటు పెద్ద సంఖ్యలో ప్రవాస తెలంగాణవారు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# సంపాదకీయం

## పరుగే ఆరోగ్యానికి దిక్సూచి

**తగ్గుతున్న శారీరక శ్రమ.**

**పెరుగుతున్న ఆరోగ్య ముప్పు.**

**పరుగుతో కొత్త జీవనం.**

**జనం వాయిస్, డెస్క్, జూన్ 2:**
ప్రపంచ పరుగు దినం అనేది కేవలం ఒక క్రీడా కార్యక్రమానికి సంబంధించిన రోజు కాదు. ఇది మన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించుకునే సందర్భం. ఆధునిక జీవనశైలి మనిషికి ఎన్నో సౌకర్యాలను అందించినప్పటికీ, అదే సమయంలో శారీరక చలనాన్ని గణనీయంగా తగ్గించింది. రోజువారీ జీవితంలో నడక, పరుగు వంటి సహజ అలవాట్లు కనుమరుగవుతున్నాయి. ఫలితంగా ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పరుగు ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ ప్రపంచ పరుగు దినం సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. ఒకప్పుడు మనిషి జీవితం మొత్తం శారీరక శ్రమతో ముడిపడి ఉండేది. పొలాల్లో పని చేయడం, కాలినడకన ప్రయాణించడం, శారీరక కృషి ఆధారిత జీవన విధానం ఆరోగ్యాన్ని సహజంగా కాపాడేది. కానీ నేడు యంత్రాలు మనిషి పనిని భర్తీ చేశాయి. కార్యాలయాల్లో గంటల తరబడి కూర్చోవడం, ఇంట్లో కూడా ఎక్కువ సమయం తెరల ముందు గడపడం సాధారణంగా మారింది. ఈ మార్పులు సౌకర్యాలను పెంచినా ఆరోగ్యానికి మాత్రం కొత్త సవాళ్లను తెచ్చిపెట్టాయి. ప్రపంచ ఆరోగ్య రంగాన్ని ప్రస్తుతం అత్యంతగా కలవరపెడుతున్న అంశాల్లో జీవనశైలి వ్యాధులు ప్రధానమైనవి. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, ఊబకాయం వంటి సమస్యలు చిన్న వయస్సులోనే కనిపిస్తున్నాయి. వీటి వెనుక ఆహారపు అలవాట్లు ఒక కారణం అయితే, శారీరక చలనం



లేకపోవడం మరింత పెద్ద కారణంగా నిలుస్తోంది. రోజువారీ జీవితంలో కొద్దిసేపు పరుగు తీసే అలవాటు అనేక వ్యాధులను దూరం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

పరుగు అనేది ఖర్చుతో కూడుకున్న వ్యాయామం కాదు. ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. ఖరీదైన సభ్యత్వాలు అవసరం లేదు. ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రారంభించగలిగే సులభమైన వ్యాయామం. అందుకే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది దీనిని తమ ఆరోగ్య రహస్యంగా భావిస్తున్నారు. ప్రతి వ్యక్తి తన సామర్థ్యానికి అనుగుణంగా పరుగును అలవాటు చేసుకుంటే ఆరోగ్య పరిరక్షణ మరింత సులభమవుతుంది. పరుగుతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో రక్తప్రసరణ సక్రమంగా జరిగి అన్ని అవయవాలకు అవసరమైన ఆక్సిజన్ అందుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. శరీరంలోని అదనపు కొవ్వు కరిగిపోతుంది. శారీరక దృఢత్వం పెరగడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా బలపడుతుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి అందించిన అత్యంత సులభమైన మార్గాల్లో పరుగు ఒకటి.

మానసిక ఆరోగ్య పరిరక్షణలో కూడా పరుగు కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు సమాజంలో వేగంగా పెరుగుతున్నాయి. పరుగు సమయంలో శరీరంలో విడుదలయ్యే రసాయనాలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయి. మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. రోజువారీ ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అందుకే వైద్య నిపుణులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా పరుగు అలవాటు అవసరమని సూచిస్తున్నారు. పిల్లల విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఒకప్పుడు ఆటస్థలాల్లో పరుగులు తీసిన పిల్లలు ఇప్పుడు మొబైల్ ఫోన్లు, వీడియో ఆటలకే పరిమితమవుతున్నారు. బహిరంగ క్రీడలు తగ్గిపోవడంతో శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి పిల్లల్లో పరుగు, క్రీడల పట్ల ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు పెంపొందించాలి.

నగరాల అభివృద్ధి కూడా పరుగు సంస్కృతికి అనుకూలంగా ఉండాలి. నడక మార్గాలు, పార్కులు, క్రీడా మైదానాలు, బహిరంగ వ్యాయామ ప్రాంతాలు పెరగాలి. ప్రస్తుతం అనేక నగరాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గిపోవడంతో ప్రజలకు వ్యాయామ అవకాశాలు పరిమితమవుతున్నాయి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మౌలిక సదుపాయాలు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రపంచ పరుగు దినం ప్రతి ఒక్కరికీ ఒక ప్రశ్నను ముందుకు తెస్తోంది. మన ఆరోగ్యానికి మనం నిజంగా ఎంత సమయం కేటాయిస్తున్నాం? ఉద్యోగం, వ్యాపారం, చదువు, వినోదం కోసం గంటల తరబడి సమయం కేటాయించే మనం, ఆరోగ్యం కోసం కొన్ని నిమిషాలు కూడా వెచ్చించకపోవడం ఆలోచించాల్సిన విషయం. ఆరోగ్యం కోల్పోయిన తర్వాత పశ్చాత్తాపపడటానికి బదులుగా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమ మార్గం. ప్రపంచ పరుగు దినం సందర్భంగా ప్రతి వ్యక్తి ఒక చిన్న సంకల్పం చేసుకోవాలి. ప్రతిరోజూ కొంత సమయం నడకకు లేదా పరుగుకు కేటాయించాలని నిర్ణయించుకోవాలి. ఆరోగ్యకరమైన వ్యక్తులే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలరు. పరుగుతో ప్రారంభమయ్యే ఈ చిన్న మార్పు వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాదు, మొత్తం సమాజ భవిష్యత్తును కూడా ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉంది. అందుకే పరుగు కేవలం వ్యాయామం కాదు, ఆరోగ్యవంతమైన జీవన విధానానికి ప్రతీక.

# సైకిల్‌తో ఆరోగ్య భవిష్యత్

**ఆరోగ్యానికి బంగారు బాట.**

**కాలుష్యానికి సమర్థ పరిష్కారం.**

**సమాజానికి కొత్త సందేశం.**



**జనం వాయిస్, డెస్క్, జూన్ 2:**
ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సాధారణ రవాణా సాధనంగా కనిపించే సైకిల్‌కు ఉన్న సామాజిక, ఆరోగ్య, పర్యావరణ ప్రాధాన్యాన్ని గుర్తు చేయడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ఐక్యరాజ్యసమితి అధికారికంగా గుర్తించిన ఈ ప్రత్యేక దినం ప్రజల్లో సైకిల్ వినియోగంపై అవగాహన పెంచేందుకు దోహదపడుతోంది. ఒకప్పుడు ప్రతి ఇంటిలో కనిపించే సైకిల్ నేడు ఆధునిక వాహనాల రాకతో కొంత వెనుకబడినప్పటికీ, దాని అవసరం మాత్రం ఎన్నడూ తగ్గలేదు. ప్రపంచ దేశాలు మళ్లీ సైక్లింగ్ సంస్కృతిని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఈ దినోత్సవం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సైకిల్ తొక్కడం అనేది అత్యంత సులభమైన వ్యాయామాల్లో ఒకటిగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతిరోజూ కొంత సమయం సైకిల్ వినియోగించడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శరీరంలోని కండరాలు దృఢంగా మారతాయి. అధిక బరువు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించడంలో కూడా ఇది సహాయపడుతుంది. ప్రస్తుతం కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, తెరల ముందు ఎక్కువ సమయం గడుపుతున్న ప్రజలకు సైక్లింగ్ ఉత్తమ శారీరక కార్యకలాపంగా మారుతోంది. వ్యాయామ కేంద్రాలకు వెళ్లలేని వారు కూడా సులభంగా ఈ అలవాటును జీవితంలో భాగం చేసుకోవచ్చు. పిల్లల్లో శారీరక చలనం తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైకిల్ వినియోగం మరింత అవసరంగా మారింది. ఒకప్పుడు పాఠశాలకు, ఆటస్థలాలకు సైకిల్‌పై వెళ్లే పిల్లలు ఇప్పుడు మోటారు వాహనాలపై ఆధారపడుతున్నారు. దీనివల్ల శారీరక శ్రమ తగ్గి అనేక ఆరోగ్య సమస్యలు చిన్న వయస్సులోనే కనిపిస్తున్నాయి. పిల్లలు రోజూ కొంత సమయం సైకిల్ తొక్కేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారి శారీరక, మానసిక ఎదుగుదలకు అది ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణలో సైకిల్ పాత్ర అత్యంత కీలకమైనది. పెట్రోల్, డీజిల్ అవసరం లేకుండా ప్రయాణం చేయగలిగే రవాణా సాధనం కావడంతో ఇది ఎలాంటి కాలుష్యాన్ని ఉత్పత్తి చేయదు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాయు కాలుష్యం, వాతావరణ మార్పుల సమస్యలను తగ్గించడంలో సైకిల్ వినియోగం సమర్థవంతమైన మార్గంగా గుర్తింపు పొందుతోంది. ఒక్క వ్యక్తి రోజువారీ ప్రయాణంలో కొంత భాగాన్ని సైకిల్‌తో పూర్తి చేసినా కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో సైకిల్ ఆర్థికంగా కూడా ఎంతో ప్రయోజనకరమైనది. వాహనాల నిర్వహణ, ఇంధన ఖర్చులు, మరమ్మతుల భారంతో పోలిస్తే సైకిల్ వినియోగం చాలా తక్కువ వ్యయంతో సాగుతుంది. ముఖ్యంగా విద్యార్థులు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇది ఇప్పటికీ అత్యంత ఉపయోగకరమైన ప్రయాణ సాధనంగా ఉంది. కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కూడా సైకిల్ కీలక పాత్ర పోషించగలదు. ప్రపంచంలోని అనేక దేశాలు సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి. సైకిల్ మార్గాల నిర్మాణం, భద్రతా సదుపాయాల కల్పన, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణ ద్వారా సైక్లింగ్ సంస్కృతిని బలోపేతం చేస్తున్నాయి. కార్యాలయాలకు, విద్యాసంస్థలకు సైకిల్‌పై వెళ్లే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్న దేశాలు కూడా ఉన్నాయి. ఈ చర్యలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతున్నాయి. మన దేశంలో కూడా సైకిల్‌కు తిరిగి ఆదరణ పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నగరాల్లో యువత ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ ఉదయం, సాయంత్రం సైక్లింగ్‌ను అలవాటుగా మార్చుకుంటున్నారు. సైక్లింగ్ క్లబ్‌లు, సమూహ ప్రయాణాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ సంస్కృతి మరింత విస్తరిస్తోంది. పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం పెరగడంతో సైకిల్ వినియోగానికి అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. ప్రపంచ సైకిల్ దినోత్సవం కేవలం ఒక ప్రత్యేక దినం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని గుర్తు చేసే సందేశం కూడా. కాలుష్యరహిత ప్రయాణం, శారీరక దృఢత్వం, ఆర్థిక పొదుపు వంటి అనేక ప్రయోజనాలను అందించే సైకిల్‌ను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా వ్యక్తిగతంగానే కాక సమాజం మొత్తం కూడా లాభపడుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను స్వీకరిస్తూనే ప్రకృతికి మేలు చేసే అలవాట్లను కొనసాగించడం అవసరం. ఆ దిశగా సైకిల్ వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాల్సిన అవసరం ఉంది.

# పెరుగుతున్న చెత్త.. తగ్గుతున్న బాధ్యత




**పరిశుభ్రతకు పెరుగుతున్న సవాళ్లు.**

**నగరాలను ముంచెత్తుతున్న వ్యర్థాలు.**

**బాధ్యత మరచిన సమాజం.**

**జనం వాయిస్, డెస్క్, జూన్ 2:**
ఒకప్పుడు గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రతకు నిలయాలుగా కనిపించేవి. ఇళ్ల ముందు ఊడ్చి శుభ్రం చేయడం, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో వేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రజల దైనందిన బాధ్యతగా ఉండేది. కానీ కాలం మారుతున్న కొద్దీ వినియోగ సంస్కృతి పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, ఒకసారి ఉపయోగించే సామగ్రి, ప్యాకేజింగ్ పదార్థాల వినియోగం విపరీతంగా పెరిగింది. అదే సమయంలో చెత్త నిర్వహణపై బాధ్యత తగ్గిపోతోంది. ఫలితంగా దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు, గ్రామాలు కూడా చెత్త సమస్యతో సతమతమవుతున్నాయి. జనాభా పెరుగుతున్న వేగంతో పాటు వ్యర్థాల ఉత్పత్తి పెరుగుతుండగా, వాటి నిర్వహణ మాత్రం పెద్ద సవాలుగా మారుతోంది. నేటి పరిస్థితుల్లో ప్రతి ఇంటి నుంచి రోజూ పెద్ద మొత్తంలో చెత్త బయటకు వస్తోంది. వంటింటి వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు, ప్యాకెట్లు, నీటి సీసాలు, వినియోగించిన వస్తువులు అన్నీ కలిసి భారీ వ్యర్థాలుగా మారుతున్నాయి. అయితే వాటిని సక్రమంగా వేరు చేసి పారవేయాలనే అవగాహన చాలా మందిలో కనిపించడం లేదు. రోడ్ల పక్కన, కాలువల్లో, ఖాళీ స్థలాల్లో చెత్తను పడేయడం సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఒకవైపు పరిశుభ్రతపై ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, మరోవైపు ప్రజల నిర్లక్ష్యం ఆ ప్రయత్నాలను బలహీనపరుస్తోంది. చెత్త నిర్వహణను కేవలం ప్రభుత్వ బాధ్యతగా భావించడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. పెరుగుతున్న చెత్త ప్రభావం కేవలం పరిసరాల అందంపై మాత్రమే కాదు, ప్రజారోగ్యంపై కూడా తీవ్రంగా పడుతోంది. పేరుకుపోయిన వ్యర్థాలు దోమలు, ఈగలు, ఇతర హానికర క్రిములకు ఆశ్రయంగా మారుతున్నాయి. దీనివల్ల డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతోంది. కాలువల్లో చేరిన చెత్త నీటి ప్రవాహాన్ని అడ్డుకుని వర్షాకాలంలో వరదలకు కారణమవుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవక సంవత్సరాల తరబడి అలాగే ఉండిపోవడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం అంటే భవిష్యత్ తరాలకు మరింత పెద్ద ముప్పును మిగిల్చడమే. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే చెత్త సమస్యపై సమాజంలో బాధ్యత భావన క్రమంగా తగ్గిపోతోంది. ఇంటిని శుభ్రంగా ఉంచే వ్యక్తి, అదే చెత్తను రోడ్డుపై పడేయడంలో తప్పు చూడటం లేదు. ప్రజా ప్రదేశాలను తమ సొంత ఆస్తిగా భావించే సంస్కృతి తగ్గిపోతోంది. పరిశుభ్రత అనేది కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత కాదనే అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ఒక వ్యక్తి నిర్లక్ష్యంగా పడేసిన చెత్త సమాజానికి ఎంతటి నష్టం కలిగిస్తుందో అర్థం చేసుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై విద్యార్థుల్లో చైతన్యం పెంచడం కాలానుగుణ అవసరంగా మారింది. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం ప్రభుత్వ చర్యలతో మాత్రమే సాధ్యం కాదు. ప్రజల భాగస్వామ్యం, బాధ్యతాయుత ప్రవర్తన, అవగాహన కలిసివస్తేనే ఫలితాలు కనిపిస్తాయి. ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండడం వంటి చిన్నచిన్న చర్యలు పెద్ద మార్పుకు దారి తీస్తాయి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది. పెరుగుతున్న చెత్తను నియంత్రించాలంటే తగ్గుతున్న బాధ్యతను మళ్లీ పెంచుకోవాలి. ప్రతి పౌరుడు తన వంతు కర్తవ్యాన్ని గుర్తించినప్పుడే స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు సాధ్యమవుతుంది.

# పసిపాదాలకు కొత్త ఆశ

**జనం వాయిస్, డెస్క్, జూన్ 2:**
ప్రతి సంవత్సరం జూన్ 3న ప్రపంచ క్లబ్‌ఫుట్ అవగాహన దినాన్ని నిర్వహిస్తారు. పుట్టుకతోనే శిశువుల పాదాలు లోపలికి లేదా కిందికి వంగి ఉండే వైకల్యాన్ని క్లబ్‌ఫుట్‌గా పిలుస్తారు. ఇది ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది చిన్నారులను ప్రభావితం చేస్తున్న సాధారణ జన్యుపరమైన సమస్యల్లో ఒకటి. సరైన సమయంలో గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా సరిచేసే అవకాశం ఉన్నప్పటికీ అవగాహన లేకపోవడం వల్ల అనేక మంది పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు ప్రపంచ క్లబ్‌ఫుట్ అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు. క్లబ్‌ఫుట్ సమస్య గర్భధారణ సమయంలోనే ఏర్పడుతుంది. శిశువు పాదాల కండరాలు, ఎముకలు, కీళ్లు సాధారణ స్థితిలో అభివృద్ధి చెందకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. సాధారణంగా వెయ్యి జననాల్లో ఒకటి లేదా రెండు సందర్భాల్లో ఈ సమస్య కనిపిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది అంటువ్యాధి కాదు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల కూడా ఏర్పడదు. అయితే కొంతమంది కుటుంబాల్లో వంశపారంపర్య కారణాలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. క్లబ్‌ఫుట్ ఉన్న పిల్లల పాదాలు లోపలికి తిరిగి కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఒక పాదం, మరికొన్ని సందర్భాల్లో రెండు పాదాలు ప్రభావితమవుతాయి. పుట్టిన వెంటనే ఈ సమస్యను సులభంగా గుర్తించవచ్చు. శిశువు నడక ప్రారంభించే వరకు వేచి చూడకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రారంభ దశలో చికిత్స ప్రారంభిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయి. చాలా మంది తల్లిదండ్రులు శస్త్రచికిత్స తప్పదని భావించి ఆందోళన చెందుతుంటారు. అయితే ప్రస్తుతం ఎక్కువ శాతం పిల్లలకు ప్రత్యేక ప్లాస్టర్ విధానం, వ్యాయామాలు, పాదాలకు మద్దతు ఇచ్చే పరికరాల ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఈ విధానంతో పాదాల ఆకారాన్ని క్రమంగా సాధారణ స్థితికి తీసుకువస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చికిత్స విధానం విజయవంతంగా అమలవుతోంది. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పిల్లలు ఎదిగే కొద్దీ నడకలో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది. పాదాలపై అసాధారణ ఒత్తిడి పడటం వల్ల నొప్పి, కదలికల పరిమితి, సామాజిక



ఇబ్బందులు కూడా తలెత్తవచ్చు. విద్య, ఉద్యోగం, క్రీడలు వంటి రంగాల్లో కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల తల్లిదండ్రులు చిన్న వయస్సులోనే చికిత్సకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచ క్లబ్‌ఫుట్ అవగాహన దినం సందర్భంగా వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. క్లబ్‌ఫుట్ ఉన్న పిల్లలు కూడా సరైన చికిత్సతో సాధారణ జీవితాన్ని గడపగలరనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అవగాహన, ముందస్తు గుర్తింపు, సమయానికి చికిత్స అనే మూడు అంశాలు ఈ సమస్యను పూర్తిగా అధిగమించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు శిశువు పాదాల్లో ఏవైనా అసాధారణ మార్పులు గమనించినప్పుడు వెంటనే వైద్య సలహా తీసుకోవడం అవసరం. అపోహలు, భయాలకు లోనుకాకుండా సరైన వైద్య చికిత్సను ఎంచుకోవాలి. క్లబ్‌ఫుట్ సమస్య శాశ్వత వైకల్యం కాదని, సమయానికి చర్యలు తీసుకుంటే పిల్లలు సాధారణంగా నడవడంతో పాటు అన్ని కార్యకలాపాల్లో పాల్గొనగలరని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రపంచ క్లబ్‌ఫుట్ అవగాహన దినం సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించాలంటే పుట్టుకతో వచ్చే సమస్యలపై అవగాహన పెరగడం అత్యవసరం. చిన్న వయస్సులోనే సరైన చికిత్స అందించడం ద్వారా వేలాది మంది పిల్లల జీవితాల్లో వెలుగులు నింపవచ్చనే విషయాన్ని ఈ దినోత్సవం గుర్తు చేస్తోంది.

# తలకిందులుగా ఎగిరిన జాతీయ జెండా.

## చౌదరిగుడా గ్రామపంచాయతీలో సర్పంచ్ నిర్లక్ష్యం.

## గ్రామ సర్పంచ్ నిర్లక్ష్యంపై స్థానికుల తీవ్ర ఆగ్రహం.

**షాద్ నగర్, జూన్ 02, జనం వాయిస్:**

జిల్లేడు చౌదరిగూడా గ్రామ పంచాయతీ కార్యాలయం వేదికగా ఓ ఘోర తప్పిదం చోటుచేసుకుంది. జాతీయ జెండాను గౌరవించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌదరి గూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాతీయ జెండాను తలకిందులుగా ఆకుపచ్చ రంగు పైకి, కాషాయ రంగు కిందికి వచ్చేలా తాడుకు కట్టారు. కనీసం చూసుకోకుండా ఆ జెండాను అలాగే పైకి ఎగురవేసి, ఆవిష్కరించారు. జాతీయ జెండాపై ఇంత నిర్లక్ష్యం పనికిరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశభక్తికి దేశభక్తులను అవమానపరిచినట్లు అని అన్నారు. జాతీయ జెండాపై కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇంత పెద్ద వేడుకలో ఇలాంటి పొరపాటు జరగడంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.



# బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.

**తెలంగాణ అమరుల స్థూపానికి నివాళులు అర్పించిన రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి. తెలంగాణను అభివృద్ధి చేసింది కెసిఆర్.**





**జనం వాయిస్, గోదావరిఖని:**

గోదావరిఖని పట్టణ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి నాయకులతో కలిసి తెలంగాణ అమరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అలాగే తెలంగాణ తల్లి, తెలంగాణ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. తర్వాత పట్టణంలోని ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాళ్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ సందర్భంగా రామగుండం నియోజకవర్గంలోని కార్మిక, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా ఉన్నామంటే దానికి కారణం కేసీఆర్ కఠోర దీక్ష, పట్టుదల వల్లనే సాధ్యమైందన్నారు. ప్రజలు స్వేచ్ఛ వాయువులతో ఉన్నారంటే ఆనాటి అమరుల త్యాగాలేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం దేశంలో అన్ని జాతీయ పార్టీలను ఏకం చేసి, తెలంగాణ రాష్ట్ర ప్రాధాన్యతను వివరించి రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసిన కేసీఆర్ పట్టుదల అన్నారు. చరిత్రను మర్చిపోయిన కాంగ్రెస్ పార్టీ నేతలు కెసిఆర్ పై అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను, ప్రజలను కాంగ్రెస్ సర్కారు సంక్షేమ పథకాల ఆశ చూపి మోసం చేసిందన్నారు. భవిష్యత్తులో రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జహీద్ పాషా, పోలాడి శ్రీనివాస రావు, బూరుగు వంశీకృష్ణ, బొబ్బిలి సతీష్, కృష్ణ స్వామి, పర్శ స్వాతి, మేకల రామస్వామి, బోట్ల పోషం, నడిపెల్లి సాయి, కడమండ్ల శ్రీహరి, కళాధర్ రెడ్డి, సురేందర్, రోడ్డ సంపత్, కరాటే రాములు, కడార్ల శ్రీధర్, సార్ల ఉదయ్, కొండ సురేష్, ఎస్కే మోహిన్, జక్కుల ప్రేమ్ కుమార్, యువరాజ్ నేత, కంకణాల దేవేందర్, దువాసి కార్తీక్, వీసం ప్రదీప్, పోయిల రవి, యుగేందర్, శ్రీకర్, ఎలకపల్లి అంజయ్య, ఎండి అన్ను, బండి రాజు, ఎస్కే షరీఫ్, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా నడుపుతున్న ఆటమ్ జూనియర్ కళాశాల.

**యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు ధర్నా. తనిఖీలు నిర్వహించి సీజ్ చేసిన డీఐఈఓ.**







**జనం వాయిస్, సంగారెడ్డి, జూన్ 02:**

సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో ఉన్న ఆటమ్ జూనియర్ కళాశాలకి ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న కళాశాలను మంగళవారం యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కళాశాల భవనాన్ని డీఐఈఓ ఆధ్వర్యంలో మూసివేయడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ, జిల్లాలో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ప్రచారం చేసుకుంటూ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయని, వాటికి ప్రభుత్వ అనుమతులు ఇవ్వటం లేదని , అదేవిధంగా షిఫ్టింగ్ పేరుతో విద్యాసంస్థలు నడుపుతున్నామని అధికారులు వచ్చి అడిగినప్పుడు కనీసం రెస్పాండ్ కాకుండా మీరు ఏం చేసుకుంటారు చేసుకోండి అని పద్ధతిలో యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సరికాదని అన్నారు. ఈ కళాశాలపై గతంలో డిఐఈఓ కీ వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగిందన్నారు. డిఐఈఓ నోటీసులు ఇచ్చిన కనీసం వాటికి రిప్లై కూడా ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరుపై సరికాదు అన్నారు. విద్యార్థుల వారి తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలపై తక్షణమే నిఘా పెట్టాలని అనుమతులు లేనటువంటి ప్రతి ప్రైవేట్ కళాశాలను మూసివేయాలని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవి తేజ, దుర్గ ప్రసాద్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# రాజాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ.

## రాజాపూర్ గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి- కొమరయ్య,

**జనం వాయిస్, రామగిరి:**

రాజాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలలో నిరంతరం సేవలందిస్తున్న సిబ్బంది సేవలను గుర్తిస్తూ రాజాపూర్ గ్రామ సర్పంచ్ వారి సంక్షేమం కోసం ఈ దుస్తులను అందచేసినరు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైందని, వారి కృషి వల్లే గ్రామం పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి- కొమరయ్య, గ్రామ , వార్డు సభ్యురాలు పుల్లెల సుజాత కాల్వ రజిత శ్రీనివాస్, వార్డ్ సభ్యులు కన్నూరి శేషి కుమార్, పుట్ట లక్ష్మి పుట్ట సంతు కాదాచి ఓదమ్మా, రమేష్ కలవేనా స్వరూప రమేష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరపు కిరణ్ గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. సిబ్బంది పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఎంజేపీ గురుకులంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



**జనం వాయిస్, పఠాన్ చెరు, జూన్ 2:**

తెలంగాణ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవం పురస్కరించుకొని, మంగళవారం పఠాన్ చేరువు మండలం చిన్న కంచర్ల గ్రామంలో గల బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో అల్లాదుర్గ్, ఐనోల్ గురుకుల ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి, ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు, అది కోట్ల మంది ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక, అమరుల త్యాగాల వల్ల నిర్మితమైన తెలంగాణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ రేఖలక్ష్మి, దశరథ్ ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



# అత్యధిక విద్యా ప్రమాణాలతో బోధన

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో ఈర్ల సమ్మయ్య

**జనం వాయిస్, కాల్వ శ్రీరాంపూర్:**




ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో అత్యధిక విద్యా ప్రమాణాలతో పిల్లలకు విద్యా బోధన చేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చదివించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య కోరారు. మంగళవారం ఆయన ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో సుశిక్షితులైన, విశేష బోధనానుభవం కలిగిన అధ్యాపకుల చేత ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన ఉచిత బోధనను అందిస్తున్నారన్నారు. ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆంగ్లమాధ్యమ పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక లక్షా ఏడు వేలతో స్మార్ట్ టీవి, రూ.7 లక్షలతో సోలార్ విద్యుత్తు ని ఏర్పాటు చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో స్మార్ట్ టీవీతో పిల్లలకు డిజిటల్ తరగతులను నిర్వహిస్తామన్నారు. పాఠశాల పిల్లల సౌకర్యం కోసం దాతల ద్వారా రూ. 1 లక్ష విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రూ. 30.25 లక్షల విలువైన అద్భుతమైన నూతన తరగతి గదులను నిర్మించామన్నారు. ఈ సారి పాఠశాలలో కంప్యూటర్ విద్యను ప్రారంభించామని, పిల్లలు స్వయంగా నేర్చుకునే విధంగా పాఠశాలలో తగిన ఏర్పాటు చేశామన్నారు. రూ.1.5 లక్షల విలువతో ప్రీ ప్రైమరీ స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్ సిలబస్ తో పాటు ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు నవోదయ, సైనిక్, గురుకుల, ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ చేస్తున్నామన్నారు. 2025-26 సంవత్సరంలో గురుకుల, మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 13 మంది బాలబాలికలు అత్యంత ప్రతిభ కనబరిచి విజయం సాధించారన్నారు. ఇద్దరమ్మాయిలు రాష్ట్రస్థాయి నీతి పద్యాల పోటీల్లో గెలుపొందారున్నారు. ప్రతి రోజు రెండు గంటలు అదనంగా పనిచేస్తూ పిల్లలను అద్భుతంగా తయారు చేస్తున్నామని ఈర్ల సమ్మయ్య తెలిపారు. ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండుసార్లు చాంపియన్ స్కూల్ (బెస్ట్ స్కూల్) అవార్డును జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, వార్డు సభ్యులు ఆవుల సునీత, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, గోపిశెట్టి సుప్రియ, బండారి సరిత, పిల్లలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

# జనసేనకు హైకోర్టులో ఎదురుదెబ్బ



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 2:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో సభ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జనసేన పార్టీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు తిరస్కరించింది. దీంతో జనసేన పార్టీకి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలినట్లైంది. సభ నిర్వహణకు అనుమతి నిరాకరించిన తెలంగాణ పోలీసుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పార్టీ కోర్టును ఆశ్రయించినప్పటికీ ఆశించిన ఉపశమనం లభించలేదు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున హైదరాబాద్‌లో "నవనిర్మాణ సంకల్ప సభ" పేరుతో భారీ సమావేశం నిర్వహించాలని జనసేన పార్టీ ప్రణాళిక రూపొందించింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా అధికారిక వేడుకలు, భారీ బందోబస్తు ఏర్పాట్లు ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల కారణాలు చూపుతూ పోలీసులు సభకు అనుమతి నిరాకరించారు. దీంతో జనసేన నాయకత్వం హైకోర్టును ఆశ్రయించి అత్యవసర విచారణ కోరింది. ఈ అంశంపై విచారణ జరిపిన న్యాయస్థానం హౌస్ మోషన్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో హైదరాబాద్‌లో ప్రతిపాదించిన సభ నిర్వహణకు న్యాయపరమైన మార్గం తాత్కాలికంగా మూసుకుపోయింది. హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో జనసేన శ్రేణుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈరోజు సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సభకు అనుమతి లభించని నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ వైఖరిని మీడియా ద్వారా ప్రజలకు వివరించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సమావేశానికి అయినా అనుమతి లభిస్తుందని ఆశిస్తున్నట్లు పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమాల వేదికగా పేర్కొన్నారు. జనసేన సభ ప్రతిపాదనపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులుగా తీవ్ర చర్చ సాగింది. పలు రాజకీయ పార్టీలు ఈ సభను వ్యతిరేకించాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున రాజకీయ సభ నిర్వహించడం సరికాదని అభిప్రాయపడ్డాయి. అధికార కాంగ్రెస్ నేతలు కూడా సభ నిర్వహణ నిర్ణయాన్ని విమర్శించారు. ఈ పరిణామాల మధ్య హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించడంతో జనసేన తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. తెలంగాణలో పార్టీ విస్తరణ ప్రయత్నాల నేపథ్యంలో ఈ ఘటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడు పవన్ కల్యాణ్ మీడియా సమావేశంలో ఎలాంటి ప్రకటన చేస్తారన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
RNI NO:TGTEL/26/A0383

## మంచిర్యాల నగరపాలక సంస్థలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

### జాతీయ జెండాను ఆవిష్కరించిన మేయర్ ధర్మి మధుకర్

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 02:**
మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ ధర్మి మధుకర్ ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో మేయర్ ధర్మి మధుకర్ మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి సాధించిన అభివృద్ధి, పురోగతిని గుర్తుచేసుకున్నారు. దేశ నిర్మాణంలో మరియు ఆర్థిక ప్రగతిలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నగరాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఉద్యోగులలో, పౌరులలో నూతన స్ఫూర్తిని నింపింది. ఈ అధికారిక వేడుకల్లో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ రమ్య, పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ కమిషనర్, మున్సిపల్ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పటాన్చెరులో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.

### అమరవీరుల స్తూపానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఘన నివాళి అర్పించారు.

**జనం వాయిస్, పటాన్చెరు జూన్ 02:**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని... పటాన్చెరు డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో గల తెలంగాణ అమరవీరుల స్తూపానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కెసిఆర్ నాయకత్వంలో 14 సంవత్సరాలు మలిదశ ప్రత్యేక తెలంగాణఉద్యమం చేపట్టి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలు సాకారం చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు పటాన్చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి సంక్షేమ రంగాలలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు, బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మంచిర్యాలలో ఘనంగా 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

### ఆంధ్ర పాలకుల ఆధిపత్య ధోరణి నశించాలి: తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక.

**జనం వాయిస్ ,మంచిర్యాల జూన్ 02:**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 51వ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఉద్యమకారులు 'జై తెలంగాణ', 'జోహార్ తెలంగాణ అమరవీరులకు' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేసి కాలనీలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా, తెలంగాణలో సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని కొనసాగించడానికి కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో సొంత రాజధాని అమరావతిని నిర్మించుకోలేని ఆంధ్రా పాలకులు, ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం పేరుతో ఇక్కడి ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తున్న మేధావులు, మీడియా ప్రతినిధులు, ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించి తప్పుడు ప్రచారాలు చేయడం వెంటనే మానుకోవాలని ఆయన హెచ్చరించారు. వేలాది మంది అమరవీరుల త్యాగాలు, ఆత్మబలిదానాల పునాదుల పైనే రాజ్యాంగబద్ధంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందనే విషయాన్ని ఆంధ్రా పాలకులు గుర్తుంచుకోవాలని వెంకటయ్య సూచించారు. ఇప్పటికైనా తెలంగాణపై ఆధిపత్యం చెలాయించే విధానాలకు స్వస్తి పలకాలని, లేనిపక్షంలో గతంలో మాదిరిగానే "ఇడ్లీ సాంబార్ గో బ్యాక్", "ఆంధ్ర గో బ్యాక్" ఉద్యమాలు మళ్లీ పురుడు పోసుకుంటాయని హెచ్చరిస్తూ అందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, కార్యదర్శి ఏ. రాజేశం, నాయకులు చిప్ప రామస్వామి, జి. రాజిరెడ్డి, రాజన్న గౌడ్, జి. లక్ష్మణ్, బాపు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

### నడిపెల్లి విజిత్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ.

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 02:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని టూ టౌన్ (హమాలీవాడ)లో నిర్వహించిన వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని, అక్కడ ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు; అనంతరం జాతీయ జెండాను ఎగరవేసి అందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరవీరుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కొనియాడిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు TBGKS నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మంచిర్యాల బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్.
- కేసీఆర్ పాలన దేశానికే మార్గదర్శకం: నడిపెల్లి దివాకర్ రావు.
- బాల్క సుమన్ అక్రమ అరెస్ట్ ప్రజాస్వామ్య విరుద్ధం.

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 02:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ పట్టణంలో గల బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ.. 14 ఏళ్ల అలుపెరుగని పోరాటంతో, ఉద్యమ రథసారధి కేసీఆర్ గారి అద్భుత సారథ్యంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సహకారమైందని అన్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం కేసీఆర్ గారి నాయకత్వంలో సాధించిన తొలి పదేళ్ల ప్రస్థానం యావత్ భారతదేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆయన చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకే కాకుండా కేంద్ర సర్కారుకు కూడా దిక్సూచిగా మారిందని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతో పాటు గత పదేళ్ల ఉజ్వల ప్రయాణంలో కేసీఆర్ వెన్నంటి నడిచిన ప్రతి ఒక్కరికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ గారిని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని దివాకర్ రావు తీవ్రంగా ఖండించారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టే ఢిల్లీ పార్టీల వల్ల రాష్ట్ర ప్రయోజనాలు అడుగడుగునా దెబ్బతింటున్నాయని, ప్రస్తుత తరుణంలో తెలంగాణ సమాజమంతా అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, తెలంగాణ గడ్డమీద పుట్టిన ప్రతి బిడ్డ మళ్లీ కేసీఆర్ గారి నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం: నియోజకవర్గ వ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు.

**జనం వాయిస్,ంచిర్యాల, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా మంచిర్యాల బైపాస్ రోడ్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు గారు, తెలంగాణ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ గారు అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. అనంతరం మంచిర్యాల బైపాస్ రోడ్‌లోనే ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు గారు, రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ గారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ వర్ధిల్లాలి అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాన్ని, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, తెలంగాణ తల్లి సాక్షిగా సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకువెళ్లాలని వారు పిలుపునిచ్చారు. మంచిర్యాల పట్టణంతో పాటు నస్పూర్ పట్టణంలోనూ ఆవిర్భావ వేడుకలు మిన్నంటాయి. నస్పూర్ పట్టణంలోని షిర్కే కాలనీ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు గారు, నడిపెల్లి విజిత్ కుమార్ గారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం అక్కడ జాతీయ జెండాను అత్యంత ఘనంగా ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో నడిపెల్లి నాయకులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.



## మందమర్రి సహకార సంఘం కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

### జాతీయ జెండాను ఆవిష్కరించిన డీసీసీబీ డైరెక్టర్ సల్వాజి ప్రభాకర్ రావు.
### సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతి వద్దు.. ఎన్నికలు నిర్వహించాలి: ప్రభుత్వానికి విజ్ఞప్తి.

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 02:**
మందమర్రి, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మందమర్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ శ్రీ సల్వాజి ప్రభాకర్ రావు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాలను నామినేటెడ్ పద్ధతిలో కాకుండా, రైతుల పూర్తి భాగస్వామ్యంతో చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పుడే సహకార వ్యవస్థ బలోపేతమై రైతులకు నిజమైన న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



## రాష్ట్ర ప్రగతిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి: జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 02:**
తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంచిర్యాలలోని భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రావణ్ కుమార్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు తదితరులు పాల్గొన్నారు.



## అమరుల స్ఫూర్తితో ఉద్యమ ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వ పాలన

### సబ్బండవర్గాల అభ్యున్నతే లక్ష్యమన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూన్ 2,(జనం వాయిస్):**
తెఖీలంగాణ సాధన కోసం అసువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమ ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు . తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన వేడుకల్లో జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి పాల్గొన్నారు. జాతీయ జెండావిష్కరణ అనంతరం, పోలీసుల గౌరవవందనం, లబ్ధిదారులకు చెక్కులపంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రితో కలిసి పరిశీలించారు. కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం, ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మల్ రెడ్డి రంగా రెడ్డి రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొని క్యాంపు కార్యాలయంపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి, అమరులకునివాళులర్పించారు. ఆనాడు సోనియాగాంధీ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే... నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పునఃనిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి.



**ఇబ్రహీంపట్నం, జూన్ 2,(జనం వాయిస్ ):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్థానిక చైర్మెన్, కౌన్సిలర్లు, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాతో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకొని జిల్లా, నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఒకరోజులో జరిగిన ప్రక్రియ కాదని, అది కోట్లాది ప్రజల ఆకాంక్షలు, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, ముఖ్యంగా తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దూరదృష్టి, అచంచల సంకల్పం, నిరంతర పోరాట ఫలితమని పేర్కొన్నారు."తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు.. అది స్వాభిమానం, స్వయం ప్రతిపత్తి, స్వీయ గౌరవానికి ప్రతీక. తెలంగాణ రాష్ట్రం సాధించి, అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత కేసీఆర్ గారిదే" అని అన్నారు.తెలంగాణ కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ హామీల అమలుపై బీజేపీ విమర్శలు.

- కాగజ్‌నగర్ సీఎం సభ పూర్తిగా విఫలం.
- రెండు తప్ప మిగిలిన హామీలన్నీ ప్రజలను మోసం చేయడానికే.
- మంచిర్యాల అభివృద్ధిని గాలికొదిలేశారు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్‌రావు ధ్వజం.

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 02:**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో కేవలం రెండు మాత్రమే అమలయ్యాయని, మిగిలినవన్నీ ప్రజలను మోసం చేయడానికేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్‌రావు ఆరోపించారు. మంచిర్యాల జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి బహిరంగ సభ పూర్తిగా విఫలమైందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తాను గెలిచిన నాలుగు సీట్లలోనూ ఘోరంగా ఓడిపోవడం ఖాయమని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తన స్వలాభం కోసమే కాంగ్రెస్‌లోని మరో వర్గం వైపు వెళ్లారని మండిపడ్డారు. అలాగే ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఒక గిరిజన మహిళ తమ గ్రామంలో పాఠశాల, కనీస తాగునీటి సౌకర్యం లేవని ప్రశ్నించడమే ఈ ప్రభుత్వ వైఫల్యానికి సజీవ సాక్ష్యమని, క్షేత్రస్థాయి సమస్యలను పక్కనబెట్టి స్థానిక ఎమ్మెల్యే పి.ఎస్.ఆర్. మంత్రుల వద్దే మకాం వేస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో ఇచ్చిన కీలక హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రఘునాథ్‌రావు ధ్వజమెత్తారు. గోదావరిపై వంతెన నిర్మాణం, టూ టౌన్ ఫ్లైఓవర్, సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రెండు గుంటల భూమి పంపిణీ, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, ఐటీ కారిడార్ ఏర్పాటుతో పాటు ఎల్లంపల్లి బాధితుల నష్టపరిహారం వంటి అంశాలను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వం 80 శాతం పనులు పూర్తి చేశామని అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. చివరకు ప్రభుత్వ సభలకు జనాలను తరలించేందుకు కనీసం ఫిట్‌నెస్ లేని బస్సులను ఉపయోగించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం తగదని, ఇకనైనా స్వార్థ రాజకీయాలు పక్కనబెట్టి నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.



# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**జనం వాయిస్, మందమర్రి, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని సంజయ్ గాంధీ విగ్రహం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొని జైలు జీవితం గడిపిన ఉద్యమ నాయకులను మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడి త్యాగం చిరస్మరణీయమని, వారి సేవలు భావితరాలకు ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్ సభ్యులు, సోషల్ మీడియా వారియర్స్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.



# మంచిర్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శల వర్షం.**
**మంచిర్యాలలో ఘనంగా తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.**
**అమరవీరులకు నివాళులర్పించిన బీజేపీ నాయకులు మున్నారాజ సిసోడియా, తులా మధుసూదన్ రావు.**



**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 02:**
మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సున్నం బట్టి ప్రాంతంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు మున్నారాజ సిసోడియా జాతీయ జెండాను ఆవిష్కరించగా, మెయిన్ చౌరస్తాలో మైనార్టీ మోర్చా నాయకులు జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం నాయకులు పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు మున్నారాజ సిసోడియా, తులా మధుసూదన్ రావు మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు, ఉద్యోగుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ పార్టీ మొదట ప్రకటన చేసి, ఆ తర్వాత వెనక్కి తగ్గి కాలయాపన చేయడం వల్లే వందలాది మంది యువకులు బలిదానాలు చేసుకోవాల్సి వచ్చిందని, ఆ మరణాలకు కాంగ్రెస్సే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నాటి పార్లమెంటులో ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్.. తెలంగాణ కోసం బీజేపీ కట్టుబడి ఉందంటూ గళం విప్పి, అధికార కాంగ్రెస్‌ను ఒప్పించి బిల్లు పాస్ కావడంలో కీలక పాత్ర పోషించారని, అందుకు యావత్ తెలంగాణ ప్రజానీకం ఆమెకు రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన తెలంగాణను గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా అవినీతి, దోపిడీతో విధ్వంసం చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దిగజారుడు రాజకీయాలతో ప్రజలను ఆగమాగం చేస్తోందని వారు తీవ్రస్థాయిలో విమర్శించారు. నాడు ఉద్యమాన్ని వ్యతిరేకించినవారే నేడు అధికారంలో ఉంటూ ఉద్యమకారుల ఆకాంక్షలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న బీజేపీకి తెలంగాణ ప్రజలు మద్దతుగా నిలిచి, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేసుకుంటేనే అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా క్రమబద్ధమైన పరిపాలన సాధ్యమవుతుందని, కాబట్టి ప్రజలు చైతన్యంగా ఉండి బీజేపీకి పట్టం కట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపికైన యువతులు జిల్లాకు గర్వకారణం.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష యువశక్తి ప్రోగ్రామ్ ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తు. మరింత మంది యువతులు సైన్యంలో చేరేందుకు ముందుకు రావాలి.**



**జనం వాయిస్, పెద్దపల్లి, జూన్-02:**
పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన యువతులు సిలివేరి శ్రీజ, చిప్ప శశివర్షిణి భారత సైన్యంలో అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపికైన యువతులను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ సేవ కోసం భారత సైన్యం, భారత వైమానిక దళంలో చేరడం ఎంతో గౌరవప్రదమైన విషయమని అన్నారు. యువశక్తి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన ఇద్దరు యువతులు అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపిక కావడం జిల్లా యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి మరింత మంది యువత, ముఖ్యంగా యువతులు భారత సైన్యం, వైమానిక దళం, నౌకాదళం వంటి రక్షణ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకొని దేశ సేవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యువశక్తి ప్రోగ్రామ్ ద్వారా యువతకు అవసరమైన శిక్షణ, మార్గదర్శనం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు సహాయ సహకారాలు అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు ఈ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన యువతుల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులకు, యువశక్తి ప్రోగ్రామ్ నిర్వాహకులకు, శిక్షణ అందించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లెంకల మహిపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**ఫిల్టర్ బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి ౦ 6 మంది ఎంపిక.**

**జనం వాయిస్, మందమర్రి, జూన్ 2:**
మందమర్రి పట్టణంలోని ఫిల్టర్ బెడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన పీఎం శ్రీ తెలంగాణ మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మోడల్ పాఠశాలలో సీట్లు పొందారు. తెలంగాణ మోడల్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందించబడుతున్న నేపథ్యంలో ఈ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. కృషి, పట్టుదలతో సీట్లు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వైద్య శ్రీనివాస చారి మాట్లాడుతూ, విద్యార్థుల విజయానికి వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం అందించిన సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిబద్ధతతో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్లపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులతో పాటు వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైద్య శ్రీనివాస చారి, ఉపాధ్యాయులు జనగామ ఉమాదేవి, భీంపుత్ర శ్రీనివాస్, జలంపెల్లి, చింతకింది లలిత, గుడివెనక రవి, రమ, మంజుల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# ప్రభుత్వ ఆఫీసుల్లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**జెండా ఎగురవేసిన చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి.**

**మరిపెడ(జూన్ 2)జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం రాష్ట అవతరణ దినోత్సవ కార్యక్రమాలు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కేంద్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రాష్ట అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ అధికారులు,ప్రజాప్రతినిధులు మౌనం పాటించి నివాళి అర్పించారు.'బంగారు తెలంగాణ' కోసం పునరంకితమవుతామని అంతా ప్రతిన బూనారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ నరేష్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు మెరుగు రాము,జాటోతు సురేష్,నీలా లచ్చిరామ్,కాంతమ్మ కరణ్ సింగ్,తిరుపతి,పానుగోతు రాములు,గంట్ల గౌతమ్ రెడ్డి,గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి,బోడ భాస్కర్,బేబీ రవి పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు అలువాల ఉపేందర్ ప్రజాపతి,చెన్నూరు మహేష్,తాడురి రమేష్,దూగుంట్ల వెంకన్న,యాదగిరి,మెప్మాలు,ఆర్పీ సభ్యులు,అంగన్‌వాడీ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై 'జై తెలంగాణ' నినాదాలతో హోరెత్తించారు. మున్సిపల్ కార్యాలయం ఒక్కటే కాదు,తహసీల్దార్ కార్యాలయం,మండల పరిషత్ కార్యాలయం,పోలీస్ స్టేషన్,ప్రభుత్వ ధవాఖానలో కార్యాలయం,కార్యాలయం..ఇలా పట్టణంలోని అన్ని శాఖల కార్యాలయాల్లోనూ అధికారులు,సిబ్బంది ఉత్సాహంగా జెండా ఎగురవేశారు. ఆఫీస్ ఆఫీస్‌కు పోటీపడి మరీ వేడుకలు చేయడంతో మరిపెడ అంతా పండుగ వాతావరణం కనిపించింది.కార్యాలయాలకు వచ్చిన ప్రజలు కూడా వేడుకల్లో పాలుపంచుకుని ఒకరికొకరు ఆవిర్భావ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



# వెంకట్రాంపురం గ్రామ పంచాయతీలో, ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.



**బయ్యారం/జనం వాయిస్ జూన్ 2:**
బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామపంచాయతీలో, సర్పంచ్ ధరావత్ శివాజీ గారి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జాతీయ జెండాను ఆవిష్కరించి తదనంతరం తను మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు గురించి తెలంగాణ రావడం కోసం కేసీఆర్ పడ్డటువంటి కృషిని కొనియాడారు అలాగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది వారి సేవలను ప్రోత్సహించే దిశగా యూనిఫామ్ లు పంపిణీ చేయడం శాలువాలతో సన్మానించడం జరిగింది కార్యక్రమంలో సెక్రెటరీ సతీష్ సొసైటీ డైరెక్టర్ కృష్ణబోయిన శీను టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మదనపు వెంకన్న వార్డ్ మెంబర్లు హై స్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కాప్రా ,జూన్ 2 ( జనం వాయిస్):**
తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లయినా అమరవీరుల ఆశయ ఫలాలు పేదలకు అందడం లేదని, పేదవాడు ఇంకా పేదవాడిగానే మిగిలిపోతున్నాడని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జవహర్‌నగర్, కాప్రా మండలాల పరిధిలో సిపిఐ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మల నరసింహ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.సిపిఐ జవహర్‌నగర్, కాప్రా మండల కార్యదర్శి డి. యాదగిరి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో నిమ్మల నరసింహ మాట్లాడుతూ.. ఎంతోమంది అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో ప్రజల కష్టాలు ఇంకా తీరకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా అధికారం, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైపోయాయని ఆరోపించారు. రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలే చూసుకుంటున్నారని, పేదలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి, ప్రజల ఆశలను నెరవేరుస్తూ వారి కష్టాలు తీర్చి నిజమైన అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో (ఏఐటీయూసీ ) మండల అధ్యక్షులు ఎ. ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, నాయకులు డి. మల్లిక, మాధవి, డి. నాగేష్, ఎండి. అన్వర్, ఎన్. దేవేందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ నూతన కమిటీ

## మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు.

## వర్కింగ్ ప్రెసిడెంట్ గా కదం రాహుల్.



**కాప్రా జూన్ 2 ( జనం వాయిస్):**
యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ అండ్ లీగల్ అవేర్నెస్ అసోసియేషన్ (యు హెచ్ ఆర్ ఎల్ ఏ ఏ) మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా ఐడి కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీగా వీ నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కదం రాహుల్ నియమితులయ్యారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా కేకే చారి కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణ, చట్టపరమైన అవగాహన కల్పించడంలో యు హెచ్ ఆర్ ఎల్ ఏ ఏ చేస్తున్న కృషిని అభినందించారు. సామాన్య ప్రజలకు న్యాయం అందించే దిశగా, ముఖ్యంగా మహిళలు, బలహీన వర్గాల హక్కుల కోసం సంస్థ మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. నూతనంగా నియమితులైన జనరల్ సెక్రటరీ వీ నవీన్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో లీగల్ అవేర్నెస్ క్యాంపులు, మానవ హక్కులపై వర్క్‌షాపులు నిర్వహిస్తామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కదం రాహుల్ మాట్లాడుతూ, బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వివిధ జిల్లాల అధ్యక్షులు, యు హెచ్ ఆర్ ఎల్ ఏ ఏ సభ్యులు, న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేశారు.

# మైదంబండ గ్రామంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జనం వాయిస్, ముత్తారం, జూన్ 2:**
ముత్తారం మండలం మైదంబండ గ్రామం లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మైదంబండ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం ఉదయం గ్రామ చౌరస్తాలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగా వెంకట రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. జెండా ఆవిష్కరణ అనంతరం మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అమరవీరుల బలిదానాల పునాదుల పైనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించిన ప్రగతిని గ్రామాల అభివృద్ధిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. పార్టీ పెద్దలందరూ ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ముందుగా అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో మైదంబండ గ్రామ ప్రజల యువత పాత్రను నాయకులు గుర్తుచేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు బియ్యని రాజు, మాజీ ఉప సర్పంచ్ శంకర్, నాయకులు బియ్యని రమేష్, బియ్యని శ్రీనివాస్, కండె రమేష్, అటాల శ్రీకాంత్, ఎర్రం రాజు, ధర భూమయ్య, ఎర్రం దేవేందర్, ఎర్రం కిట్టు , గాదశీ రమాకాంత్, బియ్యని మొగిలి, ఎర్రం మహేందర్ లతో తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛ గ్రామం సురక్షిత జలవాయు కార్యక్రమంలో భాగంగా డంపింగ్ యార్డు సందర్శన, మొక్కల నాటడం




**యాచారం, జూన్ 2,(జనం వాయిస్ ):**
మండలంలోని గున్‌గల్ గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛ గ్రామంసురక్షిత జలవాయు కార్యక్రమంలో భాగంగా గ్రామ డంపింగ్ యార్డును సందర్శించి పరిశుభ్రత చర్యలను పరిశీలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా మొక్కలను నాటి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం, వ్యర్థాల సమర్థ నిర్వహణ, హరితహారం లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజాప్రతినిధులు సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి, ఉపసర్పంచ్ మచ్చ అనిల్ కుమార్,పంచాయతీ కార్యదర్శి శోభారాణి, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్, మచ్చ లక్ష్మణ్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి.

## వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శని



**జనం వాయిస్,శాయంపేట, జూన్ 2:**
ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మార్క ప్రియదర్శిని అన్నారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం రైతు రిజిస్ట్రీ, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, ప్రభుత్వం సిఫారసు చేసిన వరి వంగడాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా భూసారం పెంపొందడంతో పాటు పంట దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఎనిమిది రకాల వరి వంగడాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నీటి వసతి సమృద్ధిగా ఉన్న రైతులు మాత్రమే స్వల్పకాలిక వరి వంగడాలను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జోష్న, హుస్సేన్‌పల్లి సర్పంచ్ యెడ్ల స్వరూప సుధాకర్, ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై పంటల ప్రణాళిక, భూసార పరిరక్షణ, రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అవగాహన పొందారు

# ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంచిర్యాలలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.
- జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు.

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 2:**
రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మంచిర్యాల పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య తదితరులు పాల్గొని అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (×ఱూజ)లో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకల్లో హర్కర వేణుగోపాలరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, అదనపు కలెక్టర్ వి. రాములు లతో కలిసి ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రగతి సందేశాన్ని ఇస్తూ... ప్రభుత్వం రైతులు, మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పిస్తూ విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తోందని వివరించారు. ఈ వేడుకల సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంజూరైన మోటారు సైకిళ్ళు, ల్యాప్ టాప్ లు, వీల్ చైర్లను అర్హులైన లబ్ధిదారులకు చేతులమీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలపించిన గీతాలు హాజరైన వారిని ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డులో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన.

**జనం వాయిస్,శాయంపేట, జూన్ 2:**
శాయంపేట మండల కేంద్రంలోని డంపింగ్ యార్డులో ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామ పాలకవర్గ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీఓ బుర్ర రంజిత్ కుమార్ తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం ద్వారా పరిశుభ్రత పెంపొందడంతో పాటు వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గ్రామాభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాల్లో విశేష సేవలందించిన గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్,సర్పంచ్ ఉమా-రవిపాల్,ఉపసర్పంచ్ దైనంపెల్లి సుమన్,పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# నంది వనపర్తిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**యాచారం, జూన్ 2,(జనం వాయిస్ ):**
మండలం పరిధిలోని నంది వనపర్తి గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం,వార్డ్ సభ్యులు, సెక్రటరీ సునీల్ కుమార్,కారోబార్ మహేందర్,అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.




# గ్రామాలు, వార్డుల్లో సభలను సమర్థవంతంగా నిర్వహించాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశం.**

**ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటాం: మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.**






**జనం వాయిస్,మంచిర్యాల , జూన్ 2:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గ్రామ మరియు వార్డు/డివిజన్ సభలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, ఈ సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణపై చర్చించాలని, యాసంగి వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. సభలలో మహిళల రక్షణ, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టాలని, భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నాటేందుకు లక్ష్యాల ప్రకారం మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన (రెస్క్యూ) బృందాలను అప్రమత్తంగా ఉంచాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంచిర్యాల జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో సభల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో పనిచేస్తామని, స్థానిక సంస్థల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సభలను అధికారుల సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ కిషన్, జెడ్పీ సీఈఓ గణపతి, డిపిఓ వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ప్రణాళికా శాఖల అధికారులు పాల్గొన్నారు

# అమరవీరుల త్యాగాలే తెలంగాణ రాష్ట్రానికి పునాది.

**రామంచ మహేందర్ రెడ్డి అక్కన్నపేట మండల బిజెపి అధ్యక్షుడు**

**జనం వాయిస్ అక్కన్నపేట, జూన్.02:**
అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నిజం చేసిన ఉద్యమకారులకు, రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు అశ్రునివాళులు అర్పించారు. మన భాష, మన యాస, మన సంస్కృతిని గర్వంగా నిలబెట్టుకున్న ఈ శుభదినాన రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు కర్ణకంటి నరేష్, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, ఈరుగుదిండ్ల రాజకుమార్, సునావత్ మోహన్ నాయక్, వార్డు సభ్యురాలు గీరవేణి అనూష చంటి, కొండ్ల సంజీవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేముల ప్రసాద్, సంతోష్, లావుడియా రైనా నాయక్, జన్నారపు కళ్యాణ్, విష్ణు, సలేంద్ర తిరుపతి, జంగపల్లి యాదగిరి, సంతోష్ చౌహాన్, గిరిమల్ల రాజు, వేముల శ్రీనివాస్, జిల్లా కనకయ్య, ఆవుల కుమార్, దార్ల రాజు, పల్లె ప్రభాకర్ రెడ్డి, బొంకూరి రజినీకాంత్, రాయికుంట తిరుపతి, గంపల మధు, గంగుల కుమార్, దూలం మల్లేశం, మాధవరెడ్డి, తేజ, సాయి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని.

**జూన్ 2, జనం వాయిస్, పాలకుర్తి:**
జనగామ జిల్లా: పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి తెలంగాణ ఉద్యమ అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల అధ్యక్షులు రాపాక సత్య నారాయణ,గిరగాని కుమారస్వామి, ఏఎంసి చైర్పర్సన్ మంజుల నాయక్,యూత్ అధ్యక్షుడు మాదాసు హరీష్,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మహ్మద్ మదార్, యాకాంతరావు, ఎండి సలీం కాంగ్రెస్ మహిళా నాయకురాలు బండ పెల్లి మనం పార్టీ నాయకులు, యువజన కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.



# సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహణ.

**నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి..**
**గడిపె మల్లేశ్.**
**ఉద్యమకారులకు కాంగ్రెస్ హామీలు వెంటనే అమలు చేయాలి జాగీర్ సత్యనారాయణ.**

**జనం వాయిస్.హుస్నాబాద్, జూన్ 02:**
తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో సీపీఐ నాయకులు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామసభల ద్వారా అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సంక్షేమ పథకాల అమలు జరగాలని అన్నారు. నిత్యావసర వస్తువులపై కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారని, వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులు పోలీసు కేసులు, ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఇప్పటికీ తగిన గుర్తింపు లభించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు ఇంటి స్థలం, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోవడం బాధాకరమన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమకారులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ నాయకులు గూడ పద్మ, జనగాం రాజ్‌కుమార్, రోళ్ల భాగ్య, ఎండి అంకుశావలి, ఎనగందుల లక్ష్మీనారాయణ, పిట్టల మొగిలయ్య, బింగి సమ్మయ్య, అయిలేని మల్లారెడ్డి, గుంటిపెల్లి లక్ష్మి, చొక్కం ఎల్లవ్వ, దొంతరబోయిన రాజవ్వ, పెద్ది నిర్మల, దొంతరబోయిన రజిత తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల సంక్షేమ రక్షకుడు సీఎం రేవంత్ రెడ్డి

**మంచిర్యాలలో ఘనంగా దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ.**
**రూ. కోట్ల విలువైన స్కూటీలు,**
**ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు అందజేత.**





**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం మరియు అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రావుఫ్ ఖాన్ అధ్యక్షతన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, కనీస వేతనాల కార్పొరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్, మరియు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గార్లతో కలిసి చైర్మన్ ముత్తినేని వీరయ్య లబ్ధిదారులకు ట్రై మోటారైజ్డ్ స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు, 5+ స్మార్ట్‌ఫోన్లు మరియు బిజినెస్ ఎంపవర్ కార్డ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరియు శాఖాధికారుల సమన్వయంతో దివ్యాంగుల కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. కోర్టు ఉద్యోగాల్లో 4 శాతం, ఉన్నత విద్యలో 5 శాతం, ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం రిజర్వేషన్లతో పాటు పోలీస్ అడ్మినిస్ట్రేటివ్ & టెక్నికల్ ఉద్యోగాల్లోనూ ప్రత్యేక కోటా కల్పించామని వివరించారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహక బహుమతిని (కల్యాణ లక్ష్మితో పాటు అదనంగా రూ. 2 లక్షలు) పెంచామని, సహాయ ఉపకరణాల నిబంధనలను సరళీకృతం చేసి అర్హులందరికీ స్కూటీలు, 5+ ఫోన్లు అందిస్తున్నామని చెప్పారు. 11 వేల స్వయం సహాయక సంఘాల ద్వారా 80 వేల మందికి ఆర్థిక చేయూతనిచ్చామని, 6 ఏళ్ల లోపు పిల్లలకు 'బాల భరోసా' ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు చేయిస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగ ఉద్యోగుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ జీఓ నంబర్ 34 ద్వారా బదిలీలు, పదోన్నతులలో వెసులుబాటు కల్పించామని, ప్రపంచ వికలాంగుల దినోత్సవం నాడు ఓడీ సౌకర్యం కల్పించామని చైర్మన్ గుర్తుచేశారు. కార్పొరేషన్ చరిత్రలోనే తొలిసారిగా నెలలో మొదటి, మూడవ బుధవారాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. పారా ఒలింపిక్ కాంస్య పతక విజేత దీప్తికి రూ. కోటి నగదు, గ్రూప్–2 ఉద్యోగం, నివాస స్థలం ఇచ్చి గౌరవించామని చెప్తూ.. భవిష్యత్తులోనూ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో దివ్యాంగులను అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేలా ప్రభుత్వం మరిన్ని పథకాలు ప్రవేశపెడుతుందని స్పష్టం చేశారు.

# పాఠశాలకు ఇంటరాక్టివ్ డిజిటల్ పానల్ బోర్డును అందజేసిన గ్రామస్తులు.

**ఆదర్శంగా నిలిచిన లంబాడిపల్లె ఉద్యోగులు,గ్రామస్తులు..**
**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యను అందిస్తామన్న ఎంఈఓ జయప్రద..**

**జనం వాయిస్ చిగురు మామిడి, జూన్.02**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని లంబాడిపల్లె గ్రామ ప్రభుత్వ పాఠశాలకు గ్రామంలోని ఉద్యోగులు,దాతల సహాయ సహకారాలతో లక్ష 20వేల రూపాయలతో కొనుగోలు చేసిన ఇంటరాక్టివ్ డిజిటల్ పానల్ బోర్డును మంగళవారం పాఠశాలకు అందజేశారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్న అనంతరం ఇంటరాక్టివ్ డిజిటల్ పానల్ బోర్డును మండల విద్యాధికారి జయప్రద రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలనే సంకల్పంతో ఇంటరాక్టివ్ డిజిటల్ పానల్ బోర్డును గ్రామంలోని ఉద్యోగులు,దాతల సహకారంతో అందజేయడం అభినందించదగ్గ విషయమని చెప్పారు.లంబాడిపల్లె గ్రామాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంఈఓ కోరారు.ఇంటరాక్టివ్ డిజిటల్ పానల్ బోర్డుతో చిన్నారి పిల్లలకు డిజిటల్ పాఠాలతోపాటు బొమ్మలు,వీడియోల రూపంలో చూపిస్తూ విద్యా బోధన చేయవచ్చని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మధ్యాహ్న భోజనం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తల్లిదండ్రులు గుర్తించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి,ఉపసర్పంచ్ నక్క ఓదెలు యాదవ్,చిగురుమామిడి జడ్పిహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎం డి.ఇర్షద్, గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మావతి,ఎస్ డి సి కమిటీ చైర్మన్ భార్గవ్ రాముడు,అడ్వైజరీ కమిటీ మెంబర్ ఐరెడ్డి ధర్మేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనుగొండ లింగారెడ్డి,ముద్రకోల మురళి,సిఆర్పీ ఆంజనేయులు,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు,దాతలు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# పాలకుర్తి ZPHS విద్యార్థుల ఘనత




**జూన్ 2 జనం వాయిస్, పాలకుర్తి:**
ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో మండల స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించిన పాలకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు.. ప్రతిష్ఠాత్మక బాసర ట్రిపుల్ ఐటీ లో 2026–27 విద్యా సంవత్సరానికి సీట్లు సాధించి మరోసారి తమ పాఠశాల కీర్తిని చాటారు. మండల ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకర్లు అయిన దేశబోయిన మానస, గిరగాని సిరి చందన, బానోత్ అనూష ముగ్గురూ ట్రిపుల్ ఐటీకి ఎంపికవడం పట్ల పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి గారు విద్యార్థులను అభినందిస్తూ.. "మా పాఠశాల విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చినప్పటికీ.. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కార్పొరేట్ సంస్థల విద్యార్థులతో పోటీపడి, ఒకే పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం మాకెంతో గర్వకారణం. సరైన పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆకాశమే హద్దుగా రాణించగలరని వీరు నిరూపించారు" అని కొనియాడారు. ఈ ఘన విజయోత్సవ కార్యక్రమంలో పాఠశాల పరీక్షల విభాగం ఇన్చార్జి ఓరుగంటి రమేష్, గుగులోతు బలరాం, కే రవి, అన్నపూర్ణ, అశోక్ కుమార్, రామకృష్ణ, సోమల్లు, మెహ్రూనిసా బేగం, నరసింహమూర్తి, మాలతి, సుమత, శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వ్యవసాయంతో పాటు మష్రూమ్ కల్టివేషన్ ద్వారా మహిళా రైతులకు అదనపు ఆదాయం.

**అలోహం మష్రూమ్స్ ను సందర్శించిన ఎర్రబెల్లి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు.**
**దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉన్న మష్రూమ్స్ ఉత్పత్తి.**

**జనం వాయిస్, హుస్నాబాద్ జూన్.02:**
జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో ఎర్రబెల్లి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు పుట్టగొడుగుల పెంపకంపై క్షేత్ర పర్యటన కార్యక్రమం వరంగల్‌లోని దేశాయిపేటలో గల అలోహ మష్రూమ్ స్టార్ట్‌అప్ కంపెనీలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. లింగంపల్లి చంద్రశేఖర్,రవి చైతన్య తంగా హాజరై మాట్లాడారు.వ్యవసాయంతో పాటు మష్రూమ్ కల్టివేషన్ ద్వారా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు అదనపు ఆదాయం ఆర్జించవచ్చని తెలిపారు.రైతులు పండించిన మష్రూమ్స్‌ను ప్యాకింగ్, బ్రాండింగ్ చేసి,ఎఫ్‌పీఓ ద్వారా మార్కెటింగ్ చేసుకోవచ్చని సూచించారు.అలాగే, మష్రూమ్ సాగుకు అవసరమైన గది ఉష్ణోగ్రత నియంత్రణ,సాంకేతిక సహాయాన్ని అలోహ మష్రూమ్ స్టార్ట్‌అప్ కంపెనీ ద్వారా ఎర్రబెల్లి మహిళా రైతు ఎఫ్‌పీఓ సభ్యులకు అందజేయనున్నట్లు తెలిపారు.దీని ద్వారా నాణ్యమైన మిల్కీ మష్రూమ్స్‌ను ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు.ప్రస్తుతం మార్కెట్లో మష్రూమ్స్‌కు కిలోకు రూ.500వరకు డిమాండ్ ఉన్నందున, రైతులు వీటి ఉత్పత్తి ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు.రాజమండ్రి నుండి విచ్చేసిన లక్ష్మీ మష్రూమ్ కల్టివేషన్ కంపెనీ చైర్మన్ శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ మష్రూమ్స్‌తో మష్రూమ్ పౌడర్, డ్రై మష్రూమ్స్, మష్రూమ్ పచ్చళ్లు, మష్రూమ్ కుకీస్, మష్రూమ్ సూప్స్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా మరింత ఆదాయం పొందవచ్చని తెలిపారు. మష్రూమ్ అనేది అధిక ప్రోటీన్ కలిగిన సూపర్ ఫుడ్ కాగా, దేశవ్యాప్తంగా దీనికి మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అలోహ మష్రూమ్ స్టార్ట్‌అప్ కంపెనీ సీఈఓ రాజు,జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి శ్రీ పెండ్లి సంపత్ కుమార్,కోఆర్డినేటర్ పెసరి రాజుతోట సోమేశ్వర్ తదితరులతోపాటు ఎంఈడీపీ శిక్షణ పొందిన 30మంది స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.




# ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు.**
**రోజుకు కనీసం 50 లారీల అన్‌లోడింగ్ జరగాలి.**
**సుముఖ గోదామును తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు.**

**జనం వాయిస,మంచిర్యాల, జూన్ 2:**





గోదాముల వద్ద వేచి ఉన్న లారీల నుంచి ధాన్యం దిగుమతి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు ఆదేశించారు. మంగళవారం ఆయన జైపూర్ మండలం ఇందారం, రామారావుపేటలోని సుముఖ గోదామును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులు, గోదాములకు తరలిస్తోందని.. ఈ క్రమంలో లారీలలో వేచి ఉన్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను గోదాం నిర్వాహకులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం దిగుమతి కోసం సరిపడా హమాలీలను సమకూర్చడం జరిగిందని, కాబట్టి రోజుకు కనీసం 50 లారీల నుండి ధాన్యం దిగుమతి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గోదాం సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మరావు ను పరామర్శించిన: మాజీ మంత్రి ఎర్రబెల్లి.

**జూన్ 2 జనం వాయిస్, పాలకుర్తి:**
జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామానికి చెందిన, తీగలధర్మ రావును ఇటీవల పాలకుర్తి మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడవడంతో, తీవ్ర గాయాలతో హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ధర్మరావును పరామర్శించి సంఘటనకు గల కారణం తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు .. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఐలేని సుధాకర్ రెడ్డి, గ్రామ నాయకులు నాయిని నర్సిరెడ్డి, ఏలూరి అశోక్ రెడ్డి, తదితరులున్నారు.



# అమరవీరులకు నివాళులు అర్పించిన హుస్నాబాద్ బిజెపి నాయకులు



**జనం వాయిస్.హుస్నాబాద్, జూన్ 2:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోతారం (ఎస్)లో బిజెపి హుస్నాబాద్ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి అమరులైన వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, మాజీ ఎంపీటీసీలు బాణాల జయలక్ష్మి, కుంట మల్లయ్య, నాయకులు వంగ శ్రీనివాస్ రెడ్డి, బైరి అరుణ్, బూతగడ్డపు బాలరాజు, రత్నాకర్ రెడ్డి, వెంకటేష్, కిషన్, బొమ్మగాని ఈశ్వర్, కొలిపాక కిరణ్, గుగులోతు రాములు, మట్టెల రంజిత్ కుమార్, సున్నపు రమేష్, పరశురాములు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అమీన్పూర్ లో ని,కె ఎస్ ఆర్ జి కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కే ఎస్ ఆర్ జి ఆధ్వర్యంలో జాతీయ జండా ఆవిష్కరణ**

**జనం వాయిస్, పటాన్చెరు జూన్ 02:**
పఠాన్ చెరువు నియోజకవర్గం అమీన్పూర్ పరిధిలోని కె ఎస్ ఆర్ జి, కార్యాలయంలో ని బి ఆర్ స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాటా రాజు, సునీత గౌడ్ ఆధ్వర్యంలో ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు ధరించిన అనంతరం జాతీయ జండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షల ఫలితంగా సాధించిన తెలంగాణ ఆత్మగౌరవాన్ని గుర్తు చేసుకుటూ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






దినపత్రిక జనం వాయిస్
RNI NO:TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

- -కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి.
- -ఉద్యమకారులను మభ్యపెట్టి ఇచ్చిన హామీలపై నిర్లక్ష్యం చేస్తే మరో ఉద్యమం చేపడుతాం.
- -తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్.





**జనం వాయిస్.హుస్నాబాద్, జూన్ 2;**

ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాలు, కెసిఆర్ లాంటి తెలంగాణ వాదులు, తెలంగాణలోని సబ్బండ వర్గాల ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ 1969 నుంచి 2014 వరకు ఎందరో తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఉద్యమాలు చేశారన్నారు. 2001లో కేసీఆర్ గారి ఆధ్వర్యంలో మొదలైన ఉద్యమం రాష్ట్రం సాధించే వరకు కొనసాగిందన్నారు. 2009లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకోవడంతో ఉద్యమం ఉవ్వెత్తున లేచిందన్నారు. ఉద్యమానికి దిగివచ్చిన కేంద్రం ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు సైతం ఉద్యోగం కల్పించిన ఘనత కేసిఆర్కే చెందుతుందని అన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు అనేక వాగ్దానాలు చేసిందని, వాటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను మభ్యపెడుతూ కాలం వెల్లదీయకుండా వెంటనే వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. లేకుంటే ఉద్యమకారులతో కలిసి పెద్ద ఎత్తున మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాలపాలు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎట్లాగూ నెరవేర్చడం లేదని, కనీసం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలనైనా ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. త్వరలోనే హుస్నాబాద్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామ గ్రామాన తిరిగి ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని సతీష్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాయంపేటలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.

## ఎంపీడీవో ఫణిచంద్ర జాతీయ పతాకావిష్కరణ



**జనం వాయిస్,శాయంపేట, జూన్ 2:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాయంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఫణిచంద్ర జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అన్ని రంగాల్లో అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ విశ్వనాథ దేవస్థానం నూతన ఈవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 2:**

మంచిర్యాల పట్టణంలో అత్యంత ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన శ్రీ విశ్వనాథ దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారి (ఈవో)గా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయ పరిపాలనా విభాగంలో ఈ నియామకం ఒక కీలక పరిణామంగా భావిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే, శ్రీనివాస్ గారు దేవస్థాన ప్రాంగణంలో ఆలయ అర్చకులను, సిబ్బందిని వ్యక్తిగతంగా కలిసి పరిచయం చేసుకున్నారు. వారితో ప్రత్యేకంగా సంభాషించి, ఆలయ దైనందిన కార్యకలాపాలు, పూజా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు, క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ గారికి ఆలయ అర్చకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీనివాస్ గారి నాయకత్వంలో దేవస్థాన కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని, భక్తుల సౌకర్యార్థం మరిన్ని వినూత్న చర్యలు చేపట్టబడుతాయని ఆలయ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# సామాజిక తెలంగాణే లక్ష్యం.

## విశ్వ జంపాల, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు.



**జనం వాయిస్ -గార్ల -జూన్ 02:**

తెలంగాణ అమరవీరులు కలగన్న సామాజిక తెలంగాణ లక్ష్యంగా ప్రజలు చైతన్యవంతం కావాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల ప్రజలకు పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గార్ల మండల కేంద్రంలోని స్థానిక తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ జన సమితి, తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమ సంఘాల నేతలు తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 2, 2014 భారతదేశ రాజకీయ చరిత్రలోనే ఒక చారిత్రక మైలురాయి. దశాబ్దాల అణచివేతపై తెలంగాణ ఆత్మగౌరవం సాధించిన విజయం అది. నేటితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, ఈ ప్రయాణాన్ని కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, ఉద్యమ లక్ష్యాలు, అమరవీరుల త్యాగాలపై విద్యావంతులుగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రం రాజకీయంగా ఎవరో ఇచ్చిన బిక్ష కాదు, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం నుండి మలిదశ ఉద్యమాల వరకు అనేక తరాల రక్తం, చెమటల సమాహారం. “నీళ్లు, నిధులు, నియామకాలు“ అనే నినాదం వెనుక కేవలం భౌగోళిక విభజన మాత్రమే లేదు; సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, వనరులపై హక్కులు సాధించాలనే బలమైన ఆకాంక్ష ఉందని తెలిపారు.రాష్ట్ర ఏర్పాటు తర్వాత మన భాష, సంస్కృతికి గౌరవం పెరిగినప్పటికీ, ఉమ్మడి రాష్ట్రంలో వివక్షను ఎదుర్కొన్న అణగారిన వర్గాల ఆశయాలు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా రంగాల క్షీణత నేటికీ సవాళ్లుగా నిలుస్తూనే ఉన్నాయి. మరోవైపు, దేశంలో సమాఖ్య వ్యవస్థ బలహీనపడుతున్న తరుణంలో హైదరాబాద్‌ను కేవలం పెట్టుబడుల కేంద్రంగానే కాకుండా, మన ప్రజల శ్రమకు, చారిత్రక అస్తిత్వానికి ప్రతీకగా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ఉద్యమం మనకు కేవలం భౌగోళిక అధికారాన్ని మాత్రమే ఇవ్వలేదు; సామాజిక న్యాయాన్ని స్థాపించే, ప్రశ్నించే బాధ్యతను కూడా అప్పగించింది. అమరులు కలగన్న “సామాజిక తెలంగాణ“ నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. ఈ 12 ఏళ్ల మైలురాయి సాక్షిగా,ఆధిపత్య రాజకీయాలను తిరస్కరిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ స్వయంపాలన స్ఫూర్తిని సజీవంగా ఉంచుదాం అన్నారు.బహుజన, అణగారిన వర్గాల ఆత్మ గౌరవమే ఊపిరిగా సామాజిక తెలంగాణ సాధన దిశగా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో 2014 గార్ల మండల పొలిటికల్ జేఏసీ చైర్మన్, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళితారకరామారావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, వార్డు సభ్యుడు పూర్ణచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు,జిల్లా కార్యదర్శి మంద రాము గౌడ్, గోసు నగేష్, సుందర్, జువాజి శీను, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, పానుగంటి రాధాకృష్ణ, తోట కొండలరావు, పల్లెబోయిన లింగయ్య, శివాజీ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గణేష్ ,ఉద్యమ నాయకులు ఉద్యమకారుల సంఘం మండల కన్వీనర్ జానీ, క్రోమరాజ్ జగదీష్, నాగాచారి, మోతుకూరి సాగర్, జంగం శ్రీను, వెంకట్, కాంతారావు, పిల్లలమర్రి వీరస్వామి, ఇమ్మడి వెంకన్న, మహిళా ఉద్యమకారులు వనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

- శాయంపేట పోలీస్ స్టేషన్‌లో జెండా ఆవిష్కరణ.
- ఎందరో త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం: ఎస్సై జక్కుల పరమేష్.

**జనం వాయిస్,శాయంపేట, జూన్ 2:**

ఎందరో త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రమని శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం శాయంపేట పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, ఎందరో అమరుల త్యాగాలు, ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సామల రఘు కుటుంబానికి సిరికొండ పరామర్శ

**జనం వాయిస్,శాయంపేట, జూన్ 2:**

శాయంపేట మండల కేంద్రానికి చెందిన సామల రఘు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధు సూదనాచారి మంగళవారం సాయం త్రం శాయంపేటకు వెళ్లి రఘు చిత్రప టానికి పూలు సమర్పించి నివాళుల ర్పించారు. రఘు ముగ్గురు కూతుళ్లు, భార్యను పరామర్శించి ఓదార్చారు. రఘు సోదరులు సీనియర్ జర్నలిస్ట్ సూర్య ప్రకాష్, మత్స్యగిరి స్వామి ఆలయ చైర్మన్ భిక్షపతిలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రఘుకు ముగ్గురు ఆడపి ల్లలు పరిస్థితులను తెలుసుకుని వారికి ఆర్థికసాయం చేశారు. భవిష్యత్ లో కుటుంబానికి అండగా ఉం టామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గుర్రం రవీందర్, పొడిచెట్టి గణేష్, బగ్గి రమేష్, అడప ప్రభాకర్, కొత్తగట్టు సాయి, రాజ్ మహమ్మద్, మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# ఇంటిపై దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలి.

## బాధితురాలు దుంద్ర నిర్మల



**కురవి, జనం వాయిస్ :**

ఇంటిపై దాడి చేసిన నిందితులపై చర్యలు చేసుకోవాలని బాధితురాలు దుంద్ర నిర్మల ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె తెలిపిన వివరాల ప్రకారం కురవి మండలానికి చెందిన నిందితులు ఇరుగు సత్యం,ఇరుగు నాగరాజు, వారి కుటుంబ సభ్యులు ఇరుగు ప్రమీల, శ్రీలత, మహేశ్వరిలు కలిసి కురవి జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న నా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇంటి సామగ్రిని ధ్వంసం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా ఇంట్లో భద్రపరిచి ఉంచిన సుమారు 2 తులాల బంగారు ఆభరణాలు మరియు రూ.1,50,000 నగదు సొమ్మును బలవంతంగా తీసుకెళ్ళారు. ఈ సంఘటన గ్రామ పెద్దల సమక్షంలో జరిగినప్పటికీ, వారిని లెక్కచేయకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారు. తాము. ఈ ఘటన వల్ల తాను తీవ్ర మానసిక వేదనతో పాటు ఆర్థిక నష్టాన్ని చవిచూశానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాము.ఈ విషయమై సంబంధిత పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు..ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే అపహరించబడిన బంగారం మరియు నగదు సొమ్మును తిరిగి ఇప్పించాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నాను.మహిళల భద్రత,ఆస్తుల రక్షణకు విఘాతం కలిగించే ఇటువంటి సంఘటనలపై పోలీసులు తక్షణ చర్యలు తీసుకొని నిందితులను చట్టం ముందు నిలబెట్టాలని బాధితురాలు కోరారు.

# నేటి నుంచి వాహెద్ నగర్ ఉర్సు ఉత్సవాలు



**జనం వాయిస్,శాయంపేట, జూన్ 2:**

శాయంపేట మండలంలోని గోవిందాపూర్ గ్రామ శివారులో గల వాహెద్ నగర్ లో వెలసిన హజ్రత్ సూఫీ మహ్మద్ ఖాజా మొయినొద్దీన్ అల్మారుఫ్ అజ్మేరి షుత్తారివుల్ ఖాద్రి రహ్మతుల్లా ఆలై దర్గా ఉత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభమవుతాయని దర్గా షరీఫ్ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సూఫి మహ్మద్ గౌసొద్దీన్ ఖాద్రి, సూఫి మహ్మద్ రియాజోద్దీన్ ఖాద్రిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాందారిపేట గుట్టలుగా పేరొందిన ఈ ప్రాంతంలో సద్గురు సందల్ రోజునే ఐక్యమైన ఆయన వాహెద్ నగర్ లో వెలువడం విశేషం. గత 60 సంవత్సరాల క్రితం సద్గురు హజ్రత్ సూఫి వాహెద్ అలీషా షుత్తారి సూఫీ మత ప్రచార గురువుగా ఆయన ఎన్నో ప్రాంతాలను పర్యటించి తమ శిష్యుల బాధలను, కష్టాలను దూరం చేశారని ప్రతీతి. ఈ నేపథ్యంలో ఇస్లాం మత ప్రకారంగా ఈ నెల 3 నుంచి 5 వరకు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 3న గుసుల్ షరీఫ్ (పవిత్ర దర్గా స్నానం) అదే రోజు రాత్రి ఫకీరుల విన్యాసాలు, ఖవ్వాలీతో సందల్ (గంధం) కార్యక్రమం అత్యంత వైభవంగా పూర్తవుతుందని చెప్పారు. కాగా నిర్మల్ నుంచి చేరుకున్న ఆ గంధం దర్గా షరీఫ్ లో ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని దర్గా పీఠాధిపతి మమ్మద్ ఖాజా ఫరీదొద్దీన్ ఖాద్రి చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ లో గంధం షరీఫ్ పూర్తికాగానే తెల్లవారి వాహెద్ నగర్ లో గంధం ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలలో వివిధ దర్గాల మత పెద్దలు, పీఠాధిపతులు హాజరవుతారన్నారు. ఈ దర్గా ఉత్సవాల నేపథ్యంలో శోభాయమానంగా ఉండే ప్రకృతి ఒడిలో పచ్చని జెండా రెపరెపలాడుతుండడం చూపరులకు ఆహ్లాదకరంగా ఉంటుందని, చల్లని వాతావరణంలో సేద తీరిన వారికి చేరువైన కష్టాలు దూరమవుతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు. ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరుకావడం ఆనవాయితీగా వస్తోంది.

# మజ్జిగ ఎక్కువగా తాగుతున్నారా?





వేసవికాలంలో దాహాన్ని తీర్చుకోవడానికి చాలా మంది మజ్జిగను ఎక్కువగా తాగుతుంటారు. మజ్జిగ శరీరాన్ని చల్లగా ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ పేగుల ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడతాయి. అయితే మజ్జిగను అతిగా తాగడం కూడా కొన్ని సమస్యలకు దారితీయవచ్చు. రోజంతా పలుమార్లు ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలు కనిపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా లాక్టోజ్‌ను సరిగా జీర్ణం చేసుకోలేని వారికి ఇబ్బందులు ఎదురవుతాయి. తక్కువ రక్తపోటు ఉన్నవారు ఉప్పు కలిపిన మజ్జిగను అధికంగా తీసుకోవడం విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. అలాగే కిడ్నీ సమస్యలు ఉన్నవారు కూడా మితంగా తీసుకోవాలి. ఆరోగ్యవంతులైన పెద్దలు రోజుకు ఒకటి నుంచి రెండు గ్లాసుల మజ్జిగ తీసుకోవడం సాధారణంగా సురక్షితంగా భావిస్తారు. భోజనం తర్వాత ఒక గ్లాసు మజ్జిగ తాగడం జీర్ణక్రియకు మేలు చేస్తుంది. అయితే చక్కెర, ఉప్పు, మసాలాలు అధికంగా కలిపి తీసుకోవడం కంటే సహజమైన మజ్జిగను ఎంచుకోవడం ఆరోగ్యానికి మరింత మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# చామగడ్డతో ఆరోగ్య లాభాలు



చామగడ్డ మన దేశంలో విరివిగా లభించే దుంప కూరగాయల్లో ఒకటి. రుచితో పాటు పోషకాలు కూడా అధికంగా ఉండటంతో చాలా మంది దీనిని ఆహారంలో భాగంగా తీసుకుంటుంటారు. ఇందులో కార్బోహైడ్రేట్లు, పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఇది శరీరానికి అవసరమైన శక్తిని అందించే మంచి ఆహారంగా గుర్తింపు పొందింది. చామగడ్డలో ఉండే పీచు పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆహారం సులభంగా జీర్ణం కావడానికి తోడ్పడటంతో పాటు మలబద్ధకం సమస్యను తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయి. కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలిగించడంతో ఆకలి నియంత్రణకు సహకరిస్తుంది. ఈ దుంపలో పొటాషియం వంటి ఖనిజాలు ఉండటంతో గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. రక్తపోటును సమతుల్యంగా ఉంచడంలో ఇది కొంతవరకు సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. శరీరంలోని కండరాల పనితీరు సక్రమంగా కొనసాగేందుకు కూడా తోడ్పడుతుంది. చామగడ్డలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి శరీరంలోని కణాలను దెబ్బతీసే హానికర మూలకాల ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఫలితంగా రోగనిరోధక శక్తి బలపడటానికి అవకాశం ఉంటుంది.



- పోషకాల సమృద్ధి అందిస్తుంది
- జీర్ణక్రియకు మేలు చేస్తుంది
- శక్తిని పెంచే ఆహారం

వ్యాయామం చేసే వారు లేదా శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారికి చామగడ్డ మంచి శక్తి వనరుగా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందించి అలసటను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే చామగడ్డను ఎల్లప్పుడూ బాగా ఉడికించి మాత్రమే తీసుకోవాలి. పచ్చిగా లేదా సరిగా ఉడకని స్థితిలో తింటే గొంతులో దురద, అసౌకర్యం కలిగే అవకాశం ఉంటుంది. మితంగా తీసుకుంటే చామగడ్డ ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందించే పోషకాహారంగా నిలుస్తుంది.

# బంకమట్టి ప్రయోజనాలు



బంకమట్టి ప్రకృతిలో లభించే సహజ పదార్థం. పురాతన కాలం నుంచే దీనిని సౌందర్య సంరక్షణలో, ఆరోగ్య పరిరక్షణలో ఉపయోగిస్తున్నారు. బంకమట్టిలో ఉండే ఖనిజాలు చర్మానికి అవసరమైన పోషణను అందించడంలో సహాయపడతాయి. బంకమట్టిని ముఖానికి పూతగా వేసుకోవడం వల్ల చర్మంపై పేరుకుపోయిన దుమ్ము, మురికి, అదనపు నూనె తొలగిపోతాయి. దీంతో ముఖం తాజాగా, కాంతివంతంగా కనిపిస్తుంది. మొటిమలు తగ్గడంలో కూడా



ఇది ఉపయోగపడుతుంది. వేసవికాలంలో బంకమట్టి ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. దీనికి సహజంగా శరీరాన్ని చల్లబరిచే గుణం ఉండటంతో ముఖానికి లేదా శరీరానికి పూతగా వేసుకుంటే వేడి ప్రభావం కొంతవరకు తగ్గుతుంది. తల వెంట్రుకల సంరక్షణలో కూడా బంకమట్టిని ఉపయోగిస్తారు. తలకు పట్టించడం వల్ల తల చర్మంపై ఉన్న మురికి తొలగి పరిశుభ్రత పెరుగుతుంది. జుట్టు సహజ మెరుపును కూడా పొందుతుంది. అయితే బంకమట్టిని నేరుగా తరచుగా ఉపయోగించకుండా, గులాబీ నీరు లేదా సాధారణ నీటితో కలిపి ఉపయోగించడం మంచిది. సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా చిన్న భాగంపై పరీక్ష చేసుకోవాలి. సహజ సౌందర్య సాధనంగా పేరుగాంచిన బంకమట్టి తక్కువ ఖర్చుతో లభించే పదార్థం. సరైన విధంగా ఉపయోగిస్తే చర్మ సంరక్షణలో, శరీరానికి చల్లదనాన్ని అందించడంలో మంచి ఫలితాలు పొందవచ్చు.

RNI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# మళ్లి టాప్-10లో సింధు

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు బ్యాడ్మింటన్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరోసారి తొలి పది స్థానాల్లోకి ప్రవేశించింది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత పదో ర్యాంక్‌ను అందుకున్న తెలుగు తేజం తన ఆటతో అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇటీవలి కాలంలో ఒక్క టైటిల్ కూడా సాధించకపోయినా, ఇండోనేషియా ఓపెన్‌లో నమోదు చేసిన అద్భుత విజయంతో సింధు తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్‌పై విజయం సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకోవడంతో పాటు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం ఎగబాకింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో సింధు 11వ స్థానంలో నిలిచింది. అయితే ఇండోనేషియా ఓపెన్ తొలి రౌండ్‌లో విజయం సాధించడంతో ఆమె పదో స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధు గత కొంతకాలంగా క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ దశలకే పరిమితమవుతూ వచ్చింది. కానీ ఈసారి ఇండోనేషియా ఓపెన్‌లో తన అనుభవాన్ని చాటుతూ టాప్-10లోకి తిరిగి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి గట్టి పోటీ ఇచ్చినప్పటికీ సింధు తొలి గేమ్‌ను 25-23తో గెలుచుకుంది. అనంతరం రెండో గేమ్‌లో మరింత దూకుడుగా ఆడి 21-16తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఇప్పుడు తదుపరి రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ దక్షిణ కొరియా స్టార్ అన్ సే యంగ్‌తో సింధు తలపడనుంది. ఈ పోరు బ్యాడ్మింటన్ అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. అగ్రశ్రేణి క్రీడాకారిణిపై విజయం సాధిస్తే సింధు మరింత ముందుకు దూసుకెళ్లే అవకాశం ఉంది. ఇండోనేషియా ఓపెన్‌లో సింధు ప్రదర్శన భారత బ్యాడ్మింటన్‌కు శుభసూచకంగా మారగా, రాబోయే అంతర్జాతీయ టోర్నీలకు ముందు ఆమె ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.






# ఢిల్లీలో ఆఫ్ఘన్ 'హోమ్' సిరీస్

క్రికెట్ చరిత్రలో అరుదైన ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. ఆఫ్ఘనిస్థాన్ జట్టు తొలిసారిగా భారత జట్టుకు ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే ఈ 'హోమ్' సిరీస్‌కు వేదిక కూడా భారతదేశమే కావడం విశేషం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మూడు ట్వంటీ-20 మ్యాచ్‌ల సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో ఈ సిరీస్ సాధ్యమవుతోంది. పరస్పర పర్యటనల ఒప్పందంలో భాగంగా ఆఫ్ఘనిస్థాన్ చేసిన ప్రతిపాదనకు భారత బోర్డు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. గతంలో కూడా ఇతర దేశాల క్రికెట్ బోర్డులకు సహకారంగా భారత బోర్డు ఇలాంటి సిరీస్‌ల నిర్వహణకు మద్దతు ఇచ్చింది. ఈ సిరీస్ కోసం ఢిల్లీని వేదికగా ఖరారు చేయడంలో భారత బోర్డు కీలక పాత్ర పోషించింది. సెప్టెంబర్ 13, 16, 19 తేదీల్లో మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మ్యాచ్‌ల నిర్వహణ కోసం స్థానిక క్రికెట్ సంఘం తమ దేశీయ టోర్నీ షెడ్యూల్‌లో కూడా మార్పులు చేయడానికి సిద్ధమవుతోంది. స్వదేశంలో రాజకీయ, భద్రతా పరిస్థితుల కారణంగా ఆఫ్ఘనిస్థాన్ గత పదేళ్లుగా తమ అంతర్జాతీయ 'హోమ్' మ్యాచ్‌లను భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహిస్తోంది. గతంలో ఐర్లాండ్, బంగ్లాదేశ్ జట్లతో జరిగిన పలు సిరీస్‌లకు కూడా భారత నగరాలే వేదికలయ్యాయి. ఇదిలా ఉండగా, ఈ ట్వంటీ-20 సిరీస్‌కు ముందే ఆఫ్ఘనిస్థాన్ జట్టు మరోసారి భారత్‌కు రానుంది. జూన్ 6 నుంచి 20 వరకు ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొననుంది. జూన్ 6న న్యూ చండీగఢ్‌లో ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుండగా, జూన్ 14, 17, 20 తేదీల్లో వరుసగా ధర్మశాల, లక్నో, చెన్నై వేదికలుగా వన్డే మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ రెండు ఫార్మాట్లలోనూ హష్మతుల్లా షాహిదీ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు.

# ఐపీఎల్ విజయం తర్వాత ఆధ్యాత్మిక బాటలో విరుష్కా

ఐపీఎల్ విజయోత్సాహం మధ్య స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి, బాలీవుడ్ నటి అనుష్క శర్మ దంపతులు మరోసారి ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నారు. ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకున్న అనంతరం ఈ జంట ఉత్తరప్రదేశ్‌లోని వృందావనంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. విరాట్ కోహ్లి, అనుష్క శర్మలు ప్రేమానంద్ మహారాజ్‌కు చెందిన రాధా కేళీ కుంజ్ ఆశ్రమానికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సాధారణ దుస్తుల్లో, ముఖాలకు మాస్క్‌లు ధరించి ఆశ్రమానికి వచ్చిన ఈ జంట ఎలాంటి ఆర్భాటం లేకుండా భక్తి భావంతో కనిపించింది. ఆశ్రమం నుంచి బయటకు వస్తున్న సమయంలో తీసిన చిత్రాలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రేమానంద్ మహారాజ్ ఆధ్యాత్మిక బోధనల పట్ల విరాట్, అనుష్కలకు ప్రత్యేకమైన ఆసక్తి ఉన్న విషయం తెలిసిందే. గతంలో కూడా పలుమార్లు ఈ దంపతులు వృందావనానికి వెళ్లి మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. జీవితంలో ప్రశాంతత, ఆత్మసంతృప్తి కోసం వారు తరచూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ ఫైనల్లో బెంగళూరు జట్టు విజయం సాధించడంతో కోహ్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ట్రోఫీ అందుకున్న క్షణాల్లో అనుష్క శర్మ కోహ్లి నుదుటిపై ముద్దు పెట్టిన దృశ్యాలు అభిమానుల హృదయాలను కదిలించాయి. అనంతరం జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో ఈ దంపతులు కలిసి చేసిన నృత్యం కూడా సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. క్రీడా విజయాల మధ్య కూడా ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్న విరుష్కా జంటను అభిమానులు ప్రశంసిస్తున్నారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా విలువలు, భక్తి, ఆధ్యాత్మిక చింతనను మరువకపోవడం ఈ జంట ప్రత్యేకతగా నిలుస్తోందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.






# వాణిజ్య గ్యాస్ ధరల మోత.. సామాన్యులకు మాత్రం ఊరట

దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ద్రవీభవన పెట్రోలియం వాయువు సిలిండర్ల ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం లభించింది. కొత్త ధరలు జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. తాజా సవరణల ప్రకారం రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరపై రూ.42 పెంపు జరిగింది. దీంతో ఒక్కో సిలిండర్ ధర రూ.3,113.50కు చేరుకుంది. కోల్‌కతాలో రూ.53.50 పెరగడంతో అక్కడి ధర రూ.3,255.50కు చేరింది. ముంబై, చెన్నై, హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ధరలను పెంచారు. అలాగే ఐదు కిలోల స్వేచ్ఛా వాణిజ్య సిలిండర్ ధరను రూ.11 పెంచడంతో ఢిల్లీలో అది రూ.821.50కు చేరింది. అయితే గృహ వినియోగదారులకు ఉపయోగపడే సబ్సిడీ, సాధారణ వంటగ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అంతర్జాతీయ విమానయాన రంగానికి ఊరటనిస్తూ విమాన టర్బైన్ ఇంధనం ధరలను సుమారు 2.7 శాతం మేర తగ్గించారు. ఈ తగ్గింపు ప్రధానంగా విదేశీ విమాన సర్వీసులకు వర్తించనుంది. అయితే దేశీయ విమానయాన సంస్థలకు వర్తించే ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన నిల్వలను బలోపేతం చేసేందుకు ఈ ధరల సవరణలు చేపట్టినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా భద్రత వంటి అంశాలు కూడా ఈ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరల పెంపు ప్రభావం ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు మరియు చిన్న ఆహార వ్యాపారాలపై పడే అవకాశం ఉంది. వారి నిర్వహణ వ్యయాలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం కనిపించే అవకాశముందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరలు యథాతథంగా ఉండటం వల్ల సామాన్య కుటుంబాలకు మాత్రం తక్షణ భారం తప్పిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# మారుతీకి రికార్డు అమ్మకాలు

దేశీయ ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న మారుతీ సుజుకీ ఇండియా మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. గత మే నెలలో సంస్థ చరిత్రలోనే అత్యధిక నెలవారీ వాహన విక్రయాలను నమోదు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అన్ని విభాగాల వాహనాలను కలిపి మొత్తం 2 లక్షల 42 వేల 688 యూనిట్ల విక్రయాలు సాధించడం ద్వారా భారతీయ వాహన రంగంలో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. భారతదేశంలో ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొన్నప్పటికీ, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మారుతీ సుజుకీ ఈ స్థాయి అమ్మకాలు సాధించడం విశేషంగా మారింది. ముఖ్యంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా ఉండే ప్రయాణికుల కార్లు, క్రీడోపయోగ వాహనాలు, బహుళ ప్రయోజన వాహనాలకు మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్ ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. విక్రయాల గణాంకాలను పరిశీలిస్తే, చిన్న కార్లు మరియు సెడాన్ విభాగంలో మారుతీకి చెందిన ప్రముఖ నమూనాలు అత్యధిక ఆదరణ పొందాయి. బాలెనో, స్విఫ్ట్, డిజైర్, వాగన్ ఆర్ వంటి ప్రజాదరణ పొందిన కార్లు కలిపి 1 లక్ష 90 వేల 337 యూనిట్ల విక్రయాలను నమోదు చేశాయి. మధ్యతరగతి కుటుంబాలకు అనువైన ధరలు, అధిక ఇంధన సామర్థ్యం, తక్కువ నిర్వహణ ఖర్చు, విశ్వసనీయ పనితీరు వంటి అంశాలు ఈ కార్లకు భారీ డిమాండ్ తీసుకువచ్చాయి. ఇక క్రీడోపయోగ వాహనాల విభాగంలో కూడా సంస్థ దూసుకుపోయింది. బ్రెజా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎక్స్‌ఎల్-6, జిమ్నీ వంటి వాహనాలు వినియోగదారులను ఆకట్టుకున్నాయి. ఈ విభాగంలో మొత్తం 79 వేల 267 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఆధునిక సాంకేతికత, ఆకర్షణీయమైన రూపకల్పన, మెరుగైన భద్రతా సదుపాయాలు, కుటుంబ ప్రయాణాలకు అనువైన విశాలమైన అంతర్గత స్థలం ఈ వాహనాల విజయానికి బలంగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు విస్తరించిన విక్రయ కేంద్రాలు, సేవా కేంద్రాల వ్యవస్థ కూడా సంస్థ విజయానికి ముఖ్య కారణంగా నిలుస్తోంది. వాహనం కొనుగోలు చేసిన తర్వాత కూడా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా మారుతీ మార్కెట్లో విశ్వాసాన్ని పెంచుకుంది. విడిభాగాల సులభ లభ్యత, తక్కువ నిర్వహణ వ్యయం, అధిక పునర్విక్రయ విలువ వంటి అంశాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. దేశీయ వాహన పరిశ్రమలో వినియోగదారుల అభిరుచులు మారుతున్నప్పటికీ, వాటికి అనుగుణంగా కొత్త నమూనాలను ప్రవేశపెడుతూ మారుతీ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. సాంకేతికత, నాణ్యత, వినియోగదారుల అవసరాల మధ్య సమతుల్యతను పాటించడం సంస్థ విజయ రహస్యంగా పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. మే నెలలో నమోదైన ఈ చారిత్రక విక్రయాలు సంస్థ భవిష్యత్ వృద్ధికి మరింత బలాన్ని చేకూర్చనున్నాయి. పండుగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, కొత్త వాహనాల కొనుగోళ్లపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతుండటంతో రాబోయే నెలల్లో కూడా మారుతీ సుజుకీ మరిన్ని రికార్డులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# గ్రీన్ ఇంధన రంగంలో బిర్లా భారీ అడుగు

దేశీయ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న ఆదిత్య బిర్లా గ్రూప్ పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ విస్తరణకు సిద్ధమవుతోంది. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిలో తన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకునే లక్ష్యంతో సంస్థ వేల కోట్ల రూపాయల విలువైన కీలక ఒప్పందానికి ప్రయత్నిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అంతర్జాతీయ ఇంధన సంస్థ షెల్‌కు అనుబంధంగా పనిచేస్తున్న స్ప్రింగ్ ఎనర్జీ అనే పునరుత్పాదక విద్యుత్ సంస్థను కొనుగోలు చేసేందుకు ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం చర్చలు జరుపుతోంది. ఈ ఒప్పందం విలువ సుమారు పద్నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఇది పూర్తయితే దేశంలోని పునరుత్పాదక ఇంధన రంగంలో ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద ఒప్పందాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారతదేశంలో కూడా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు విస్తృత ఆదరణ లభిస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ గ్రీన్ ఇంధన రంగంలో దూకుడు ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం సంస్థ దేశంలోని పది ప్రధాన రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ సుమారు 4.3 గిగావాట్ల సామర్థ్యంతో పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. అయితే రాబోయే సంవత్సరాల్లో ఈ సామర్థ్యాన్ని 10 గిగావాట్లకు పెంచాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ లక్ష్యాన్ని వేగంగా చేరుకోవడంలో స్ప్రింగ్ ఎనర్జీ కొనుగోలు కీలక పాత్ర పోషించనుందని భావిస్తున్నారు. స్ప్రింగ్ ఎనర్జీ ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. సంస్థకు ఉన్న విస్తృత మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి సామర్థ్యం, సాంకేతిక అనుభవం ఆదిత్య బిర్లా గ్రూప్‌కు అదనపు బలాన్ని అందించనున్నాయి. ఈ విలీనం ద్వారా కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమయ్యే సమయం, పెట్టుబడులను కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చని పరిశ్రమ నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత ప్రభుత్వం కూడా స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పలు ప్రోత్సాహక విధానాలను అమలు చేస్తోంది. దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన రంగానికి విస్తృత అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పెద్ద పారిశ్రామిక సంస్థలు గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెంచుతున్నాయి. ఈ ప్రతిపాదిత ఒప్పందం విజయవంతమైతే దేశీయ సౌర, పవన విద్యుత్ రంగాల్లో పోటీ మరింత పెరగనుంది. ఫలితంగా ఆధునిక సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి విస్తరించడంతో పాటు వినియోగదారులకు మరింత స్థిరమైన, పర్యావరణహిత విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా విస్తరిస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ ఈ ఒప్పందంతో దేశంలోని అగ్ర గ్రీన్ ఇంధన సంస్థల జాబితాలో మరింత బలమైన స్థానం సంపాదించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ADITYA BIRLA GROUP



# తాప్సీ అందాల హవా.. సోషల్ మీడియాలో మళ్లీ సందడి

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని, అనంతరం హిందీ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగిన తాప్సీ పన్ను మరోసారి వార్తల్లో నిలిచింది. అందం, అభినయం, విభిన్న పాత్రల ఎంపికతో ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న ఈ నటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తన తాజా చిత్రాలతో ఆకట్టుకుంటోంది. 2010లో విడుదలైన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తాప్సీ తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందింది. సహజమైన నటన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో యువతలో ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంది. ఆ తర్వాత 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'గుండెల్లో గోదారి', 'సాహసం', 'ఆనందో బ్రహ్మ' వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకుంది. తెలుగు చిత్రాల్లో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ, తాప్సీ తన కెరీర్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది. వాణిజ్య చిత్రాలతో పాటు కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంపిక చేసుకుంటూ నటిగా తన ప్రత్యేకతను నిరూపించుకుంది. 'పింక్', 'బేబీ', 'ది ఘాజీ అటాక్', 'నామ్ షబానా', 'ముల్క్', 'బద్లా', 'మిషన్ మంగళ్', 'తప్పడ్', 'సాండ్ కీ ఆంఖ్', 'హసీన్ దిల్‌రుబా', 'డుంకీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో రూపొందిన చిత్రాల్లో ఆమె నటనకు విశేష ఆదరణ లభించింది. ప్రస్తుతం కూడా తాప్సీ చేతిలో పలు భారీ చిత్రాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు అగ్ర హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు మహిళా కేంద్రిత కథలను ప్రోత్సహిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ తాప్సీ చురుకుగా ఉంటుంది. షూటింగ్ విరామ సమయంలో విదేశీ పర్యటనలు చేస్తూ, అక్కడి అందమైన ప్రదేశాల్లో దిగిన చిత్రాలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటోంది. ఆమె పంచుకునే ప్రతి ఫొటో నెట్టింట వైరల్‌గా మారుతోంది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా చిత్రాలు కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సొగసైన దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించిన తాప్సీ, తన ప్రత్యేకమైన చిరునవ్వుతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తూ, ఆమె అందం రోజురోజుకీ మరింత పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. విభిన్న పాత్రలు, బలమైన కథల ఎంపిక, అద్భుతమైన నటనతో భారతీయ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు పొందిన తాప్సీ పన్ను, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# రూమర్లపై త్రిష సూటి కౌంటర్?

కోలీవుడ్ స్టార్ నటి త్రిష చేసిన తాజా సామాజిక మాధ్యమ పోస్టు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలంగా ఆమె పేరు ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ తో ముడిపెడుతూ వస్తున్న పుకార్ల మధ్య త్రిష చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.తన సామాజిక మాధ్యమ ఖాతాలో ప్రశాంతంగా నిద్రిస్తున్న తన పెంపుడు కుక్క ఫొటోను పంచుకున్న త్రిష, "నా విషయాల్లో ముక్కు పెట్టడానికి నేను అనుమతించే ఒకే ఒక్క ముక్కు ఇదే" అని వ్యాఖ్య రాసింది. ఈ వ్యాఖ్య నేరుగా ఎవరినీ ఉద్దేశించి చేయకపోయినా, తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న ఊహాగానాలకు పరోక్ష సమాధానంగా భావిస్తున్నారు. ఇటీవల త్రిష, విజయ్ గురించి అనేక రకాల ప్రచారాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారాలపై ఇప్పటివరకు ఇద్దరూ బహిరంగంగా స్పందించలేదు. ఇలాంటి సమయంలో త్రిష చేసిన ఈ పోస్టు అభిమానులు, నెటిజన్లలో విస్తృత చర్చకు దారితీసింది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనవసర వ్యాఖ్యలు, ఊహాగానాలు పెరుగుతున్న నేపథ్యంలో త్రిష తనదైన శైలిలో స్పందించిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది రూమర్లకు ఇచ్చిన గట్టి హెచ్చరికగా పేర్కొంటున్నారు. ఇటీవల త్రిష చేసే ప్రతి పోస్టు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతుండగా, ఈ తాజా పోస్టు కూడా అదే స్థాయిలో చర్చనీయాంశమైంది. వ్యక్తిగత జీవితానికి గౌరవం ఇవ్వాలనే సందేశాన్ని ఆమె ఈ పోస్టు ద్వారా పరోక్షంగా తెలియజేసిందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మొత్తానికి, తన గురించి వస్తున్న ప్రచారాలను పెద్దగా పట్టించుకోకుండా త్రిష తనదైన శైలిలో స్పందించింది. ఈ వ్యాఖ్యల తర్వాత అయినా ఆమె వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న ఊహాగానాలకు తెరపడుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# పసుపు రంగు దుస్తుల్లో మెరిసిన తమన్నా..



దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి తమన్నా భాటియా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పసుపు రంగు మాక్సీ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సాధారణతకు, హుందాతనానికి ప్రాధాన్యత ఇస్తూ ఆమె ఎంచుకున్న ఈ దుస్తులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. లేత పసుపు రంగులో రూపొందిన ఈ దుస్తులు వేసవి కాలానికి అనువుగా ఉండటమే కాకుండా, తమన్నా వ్యక్తిత్వానికి మరింత అందాన్ని చేకూర్చాయి. భుజాలపై సున్నితంగా అమర్చిన పట్టీలు, శరీరాకృతికి సరిపోయే విధంగా రూపొందించిన పైభాగం, కిందికి వెళ్లే కొద్దీ అలల మాదిరిగా కనిపించే పొరలు ఈ దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నడుస్తున్న సమయంలో దుస్తులు అందించే సహజమైన కదలిక ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని జోడించింది. తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు తమన్నా సాదాసీదా శైలినే ఎంచుకుంది. అతిగా అలంకరణలకు దూరంగా ఉంటూ, సున్నితమైన మేకప్‌తో సహజమైన అందాన్ని ప్రతిబింబించింది. అలాగే సాధారణ హెయిర్ స్టైల్‌తో తన మొత్తం రూపాన్ని సమతుల్యంగా మలిచింది. ఆమె ధరించిన ఆభరణాలు కూడా అధిక ఆడంబరానికి దూరంగా ఉండి, క్లాసిక్ శైలిని ప్రతిబింబించాయి. నటనతో పాటు వ్యాపార రంగంలోనూ తమన్నా విజయవంతంగా ముందుకు సాగుతోంది. 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' పేరుతో ఆమె ప్రారంభించిన ఆభరణాల వ్యాపారం క్రమంగా విస్తరిస్తోంది. ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వజ్రాభరణాలను వివిధ కార్యక్రమాల్లో ధరించడం ద్వారా ఆమె తన బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకువస్తోంది. ఒక నటిగా మాత్రమే కాకుండా, మహిళా వ్యాపారవేత్తగా కూడా తన ప్రతిభను చాటుకుంటోంది. సినిమాల విషయానికి వస్తే, తమన్నా ప్రస్తుతం పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉంది. విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలను ఎంపిక చేసుకుంటూ తన నటనా ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. వాణిజ్య చిత్రాలతో పాటు కొత్త తరహా పాత్రలను కూడా స్వీకరిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఫ్యాషన్, వ్యాపారం, నటన అనే మూడు రంగాల్లోనూ సమానంగా రాణిస్తూ తమన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. ప్రతి సందర్భంలోనూ తన అభిరుచి, ఆత్మవిశ్వాసం, హుందాతనాన్ని ప్రతిబింబిస్తూ ఆమె యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఆమె తాజా చిత్రాలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, ఆమె స్టైల్ మరియు వ్యక్తిత్వంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# తెలంగాణ యాస వచ్చా..? సినిమాల్లో ఛాన్స్ కావాలా..! మేకర్స్ బంపర్ ఆఫర్..!!

ఇటీవల 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన నిర్మాణ సంస్థ ఇప్పుడు మరో అర్థవంతమైన, సందేశాత్మక కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. విలక్షణ దర్శకుడు వేణు వుడుగుల, సంధ్యా భాను చల్లా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మధుకర్ రెడ్డి కొమిరెడ్డి కథను అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందనుంది. అన్నదమ్ముల మధ్య విభేదాలు, కుటుంబ కలహాలు అనే సున్నితమైన అంశాన్ని ఈ చిత్రం ప్రధాన కథాంశంగా తీసుకుంది. ఒక కుటుంబం చీలిపోతే కేవలం ఆ ఇంటికే నష్టం జరుగుతుందా, లేక ఆ ప్రభావం మొత్తం గ్రామంపైనే పడుతుందా అనే భావోద్వేగ ప్రశ్న చుట్టూ కథ సాగనుందని చిత్రబృందం వెల్లడించింది. "అన్నదమ్ములు రామలక్ష్మణుల్లా ఉండే రోజులు పోయాయి. ఇప్పుడు రక్తం పంచుకున్న వారే ఒకరిపై ఒకరు నిలబడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జమ్మికుంట మట్టిని సాక్షిగా ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన పంచాయితీ ఒక ఇంటి గడపను మాత్రమే కాదు, మొత్తం ఊరి భవిష్యత్తునే మార్చేసింది. చివరకు గెలిచింది ఎవరో



తెలియకపోయినా ఓడిపోయింది మాత్రం ఊరేనని" మేకర్స్ విడుదల చేసిన భావోద్వేగ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చిత్రం కోసం ప్రస్తుతం నటీనటుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ యాసను సహజంగా మాట్లాడగలిగే వారు, నటనపై ఆసక్తి ఉన్న అన్ని వయసుల వ్యక్తులు తమ ఆడిషన్ వీడియోలను పంపవచ్చని చిత్రబృందం తెలిపింది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆడిషన్ వీడియోలను ఇమెయిల్ లేదా వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. అయితే సామాజిక మాధ్యమాల్లో చేసే చిన్న వీడియోలను పరిగణనలోకి తీసుకోబోమని, కేవలం సరైన ఆడిషన్ వీడియోలను మాత్రమే పరిశీలిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు. 'రాజు వెడ్స్ రాంబాయి' తర్వాత మరోసారి గ్రామీణ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల ప్రాధాన్యతను ప్రతిబింబించే కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, భాష, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుంటుందో చూడాల్సి ఉంది.


Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com